RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 26 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | శనివారం 12 - 7 - 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 26 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Saturday, July,12, 2025 | PAGES : 8 RS : 4 /- |




## హైదరాబాద్‌లో జింక మాంసం కలకలం..!

**హైదరాబాద్,జూలై,11,తెలంగాణ దిశ:** మన దేశంలో జింక మాసం నిషేధం. అమ్మకూడదు.. తినకూడదు. ఇదీ జాతీయ రూల్. అలాంటిది ఇప్పుడు జింక మాంసం చాలా ఈజీగా దొరుకుతుంది. జింకను వేటాడ కూదని అవగాహన కల్పించినా యదేచ్ఛగా చంపుతున్నా రు. అనంతరం అమ్ముకుం టున్నారు. డబ్బుల కోసం అడవి జంతువును వేటాడుతున్నారు. ఈ ఘటనలో హైదరాబాద్ నడిబొడ్డులో జరిగింది. టోలిచౌకికి చెందిన సిరాజ్, వసీమ్ చార్మినార్ చౌక్ వద్దకు వెళ్లారు. ఓ వ్యక్తి వద్ద జింక మాసం కొనుగోలు చేశారు. దీంతో ఈ సమాచారం పోలీసులకు అందించారు. రంగంలోకి దిగిన టీమ్.. సిరాజ్, వసీమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. 'ఎవరి వద్ద కొనుగోలు చేశారు. జింకను ఎక్కడ పట్టుకొచ్చారు.' అనే కోణంలో విచారణ చేపట్టారు. అయితే జింకమాసం విక్రయం వెనుక పెద్ద నెట్ వర్కే ఉన్నట్లు తెలుస్తోంది. ఎప్పటి నుంచో ఈ దందా జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ దందా వెనక ఎవరున్నారో కనిపెట్టి మిగిలిన జింకల ప్రాణాలను కాపాడాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

## రాజ్యాంగం నుంచి సెక్యులర్, సోషలిజం
# పదాలను తొలగిస్తున్న బీజేపీ : ఖర్గే



**భువనేశ్వర్,జూలై,11:** బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగం నుంచి లౌకిక, సామ్య వాద పదాలను తొలగిస్తున్నదని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేఅన్నారు. ఒడిశాలో జరిగిన సంవిదాన్ బచావో సమావేశ్ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. దళితులు, గిరిజనులు, ఈ దేశ యువత తమ హక్కుల కోసం బీజేపీ పాలనలో పోరాడాల్సి ఉంటుందన్నా రు. ఒడిశాలోని దళితులు, ప్రభుత్వ ఆఫీసర్లపై బీజేపీ మద్దతుదారులు అటాక్ చేస్తు న్నారని ఖర్గే ఆరోపించారు. పేదలు, దళితులు, గిరిజనులు తమ హక్కుల కోసం పోరాటం చేయడం నేర్చు కోకుంటే వాళ్లను బీజేపీ తుడిచి వేస్తుందని అన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం 160 పీఎస్‌యూలను ఏర్పాటు చేస్తే, బీజేపీ వాటిల్లో 23ను ప్రైవేటు పరం చేసిందన్నారు.

## సామాజిక న్యాయానికి కట్టుబడి
# పనిచేస్తున్న ప్రజాప్రభుత్వం



### జూలై 14నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ:మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్,జూలై,11,తెలంగాణ దిశ:** ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేస్తుందని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం తిరిమలగిరి నందు జూలై 14 న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నూతన రేషన్ కార్డులు పంపిణీ చేస్తారని మంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమ సన్నాహక సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గత 100 సంవత్సరాలలో భారతదేశం లోని ఏ రాష్ట్రము చేయని బీసీ కులగణన విజయవంతం చేశామని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కులగణన చేసి, బీసీలకి స్థానిక సంస్థ ఎన్నికలలో 42 శాతం అమలు కొరకు చట్టం తెచ్చామని, జూలై 10ననిర్వహించిన క్యాబినె ట్ సమావేశంలో బీసీలకి 42 శాతం రిజర్వేషన్లను స్థానిక సంస్థ ఎన్నికల్లో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అలాగే ప్రజల కోరిక మేరకు ఎస్సీవర్గీకరణ చేశామని బిసి కులగ ణన, ఎస్సి వర్గీకరణ అనే రెండు క్యాబినెట్ సబ్ కమిటిలకి చైర్మన్ గా తానే వ్యహరించానని తెలిపారు.

## 51కి చేరిన కల్తీ కల్లు బాధితులు.. 9 మంది మృతి



**హైదరాబాద్,జూలై,11,తెలంగాణ దిశ:** హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లి ప్రాంతంలో సంచలనం సృష్టించిన కల్తీ కల్లు ఘటనలో బాధితుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. ఇప్పటివరకు ఈ కల్తీ మద్యం సేవించి తీవ్ర ఆరోగ్య సమ స్యలకు గురైన బాధితుల సంఖ్య 51కి చేరింది. గాంధీ ఆస్పత్రిలో 14 మంది బాధితులకు ఇంకా చికిత్స కొనసాగుతోంది. నిమ్స్‌లో 34 మంది బాధితులు చికిత్స పొందుతున్నారు. వీరిలో ఆరుగురికి పరిస్థితి విషమంగా ఉండటంతో డయాలసిస్ నిర్వహిస్తున్నారు. అలాగే, ఆస్పత్రి లో ఒకరు, ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మరొకరు చికిత్స పొందుతున్నారు.ఇక కల్తీ మద్యం తాగి మృతిచెందిన వారి సంఖ్య 9కి పెరిగింది. బాధితుల్లో పలువురు వ్యాపారులు, రోజువారీ కూలీలు ఉండగా, వారి కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయి. మద్యం తాగిన కొద్ది గంటల తర్వాతే వాం తులు, తలనొప్పి, దృష్టి మందగించడం, అపస్మారక స్థితి వంటి లక్షణాలతో బాధితులు ఆసుపత్రుల పాలవుతుండగా, అధికారులు విచారణ ప్రారంభించారు.బాలానగర్ ఆబ్కారీ శాఖ అధికారులు ఇప్పటివరకు నలుగురిని అరెస్టు చేశారు. ఒకరు పరారీలో ఉన్నారు.

## నాయకత్వ మార్పు లేదని
# ఎన్ని సార్లు చెప్పాలి



### జర్నలిస్టులపై సిద్ధరామయ్య రుసరుసలు

**బెంగళూరు,జూలై,11:**కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు జరగబోతుం దంటూ గత కొద్ది రోజులుగా వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. దాదాపుగా 100 మంది ఎమ్మెల్యేలు డీకే.శివకుమార్‌కు మద్దతు ఇస్తున్నారని ఇటీవల ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. ఇక కర్ణాటకలో పరిస్థితిని గమ నించిన హైకమాండ్.. దూతలను పంపి ఎమ్మెల్యేలతో విడివిడిగా చర్చించా రు. తాజాగా అధిష్టానం పెద్దలను కలిసేందుకు ముఖ్యమంత్రి సిద్ధరామ య్య, డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ హస్తినకు వెళ్లారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీని కలవాల్సి ఉండగా భువనేశ్వర్‌లో ప్రజా ర్యాలీ కారణంగా అక్కడికి వెళ్లిపోయారు. దీంతో ఏఐసీసీ పెద్దలను, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను సిద్ధరామయ్య కలిశారు. భేటీ అనంతరం సిద్ధరామయ్యను విలేకర్లు ప్రశ్నించారు.

## స్థానిక ఎన్నికలకు ఇప్పటికే ఆలస్యమైంది..
# ఎవరూ అడ్డుపడొద్దు : మంత్రి పొన్నం


**హైదరాబాద్,జూలై,11,తెలంగాణ దిశ:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావాలని నిర్ణయించినట్లు బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడిం చారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీసీల నోటి వద్ద ముద్ద లాక్కోవ ద్దని విపక్షాలకు విజ్ఞప్తి చేశారు. భాజపా బల హీన వర్గాలకు వ్యతిరేకమన్నారు."రాష్ట్రంలో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒకదాని తర్వాత ఒకటి చేసుకుంటూ వెళ్తున్నాం. కులగణన నుంచి రిజర్వేషన్ల పెంపు వంటివి చట్టంచేసి కేంద్రానికి పంపే వరకు సీఎం రేవం త్‌రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రివర్గ సహచరులు అందరం కృషి చేశాం. కామారెడ్డి డిక్లరేషన్ నుంచి 42శాతం రిజర్వేషన్ల వరకు ఎక్కడా కాంగ్రెస్ పార్టీ తగ్గలేదు. కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం జరుగుతుంది. ఇప్పటికే పంచాయతీ ఎన్నికలు ఆలస్యమయ్యా యి. ఎవరూ అడ్డుపడొద్దు"అని మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు.: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో శుక్రవారం రూ.5 కోట్లకు పైగా నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. యూసు ఫ్‌గూడ సర్కిల్‌లోని వెంగళ్‌రావు నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రులు వివేక్ వెంకట స్వామి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి నాయకత్వంలో అన్ని సమస్యలు పరిష్కరి స్తున్నామన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత హై



దరాబాద్ నగరంలో బస్తీలు, కాలనీల అభివృద్ధి చెందలేదని పేర్కొన్నారు.

## కూకట్‌పల్లిలో హైడ్రా కూల్చివేతలు

**హైదరాబాద్,జూలై,11,తెలంగాణ దిశ:** తెలంగాణలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. తాజాగా కూకట్ పల్లిలో అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చి వేస్తున్నారు. పోలీసుల భారీ బందోబస్తు మధ్య కూల్చివేతల కార్యక్రమం కొనసాగుతోంది. వివరాల ప్రకారం.. కూకట్‌పల్లిలోని బాలాజీ నగర్ డివిజన్ హబీబ్ నగర్‌లో అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చి వేస్తున్నారు. అక్కడ నాళాను ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను తొలగిస్తున్నారు. ఈ నిర్మాణాలపై ఫిర్యాదు అందడంతో రంగంలోకి దిగిన హైడ్రా.. కూల్చివేతలను ప్రారంభించింది.



## జాగృతి రైల్ రోకో నిరవధిక వాయిదా..!

### - సర్కార్ కు వారం గడువు : కవిత

**హైదరాబాద్,జూలై,11,తెలంగాణ దిశ:** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్డినెన్స్ ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం బీసీ బిడ్డలు, తెలంగాణ జాగృతి,యునైటెడ్ పూలే ఫ్రంట్ విజయం అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఆర్టినెన్స్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటన చేసిన నేపథ్యంలో ఈ



నెల 17వతేదీన తాము నిర్వహించ తలపెట్టిన రైల్ రోకోను నిరవధిక వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడి న కవిత.. ప్రభుత్వం తీసుకువచ్చే ఆర్డినెన్స్ ను ఆమోదించకు ండా గవర్నర్ ఆపితే మళ్లీ రైల్ రోకో తప్పదని హెచ్చరించారు.

## హిమాచల్‌ను ముంచెత్తిన వరదలు..



**న్యూఢిల్లీ,జూలై,11:**హిమాచల్‌ప్రదేశ్‌ను ఆకస్మిక వరదలు హడలెత్తించాయి. దీంతో మండి జిల్లాలో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరిగింది. ఇప్పటి వరకు 91 మంది చనిపోయారు. ఇక కొండచ రియలు విరిగిపడడంతో గ్రామాలకు గ్రామాలే దెబ్బతిన్నాయి. ఆకస్మాత్తుగా వరదలు సంభవించడంతో చాలా మంది ప్రవాహంలో కొట్టుకుపోయారు. ఇక పంగ్లుయెడ్ గ్రామంలో రెండు కుటుంబాలకు చెందిన తొమ్మిది మంది గల్లంతయ్యారు. వారికి సంబంధించిన నలుగురి మృతదేహాలు దాదాపు 150 కి.మీ. దూరంలో లభ్యమయ్యాయి. మరో ఐదుగురి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. మృతదేహాలు చాలాదూరం కొట్టుకుపోతుండడంతో గుర్తించడం కష్టంగా మారింది.

## భారత్ నష్ట పోయినట్లు ఒక్క ఫొటో చూపించండి
### మీడియాపై అజిత్ దోవల్ ఫైర్..



**చెన్నై,జులై,11:**చెన్నైలో జరిగిన ఐఐటీ మద్రాస్ 62వ స్నాతకోత్సవానికి జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆపరేషన్ సిందూర్ గురించి మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని అజిత్ దోవల్ వివరించారు. భారతదేశం నష్టాన్ని చూపించే ఒక్క చిత్రాన్ని అయినా తనకు చూపించాలని అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పలు విదేశీ మీడియా సంస్థలు పాకిస్థాన్ భారత్‌లోని పలు ప్రాంతాలను ధ్వంసం చేశాయని కథనాలు రాశాయి. ఈ అంశంపై తాజాగా జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ స్పందించారు. ఆపరేషన్ సిందూర్ గురించి అజిత్ దోవల్ మాట్లాడుతూ.. "ఆపరేషన్ సిందూర్‌కు 23 నిమిషాలు పట్టింది. పాకిస్థాన్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై దాడి చేయాలని మేము నిర్ణయించుకున్నాం. ఆపరేషన్ సిందూర్ పట్ల గర్విస్తున్నాం. ఆ నిర్ణీత 9లక్ష్యాలపై తప్ప మరె క్కడా దాడి చేయలేదు. దాడులు ఖచ్చితమైనవి. బ్రహ్మోస్, రాడార్ లాంటి స్వదేశీ ఆయుధాలతో దాడులు జరిపాం." అని ఆయన వ్యాఖ్యా నించారు. ఆపరేషన్ సిందూర్ గురించి తప్పుడు నివేదికలు ఇచ్చిన విదేశీ మీడియాపై అజిత్ దోవల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.పాకిస్థాన్ దాడులు చేసిందని విదేశీ మీడియా చెప్పింది. భారత్‌లో ఏదైనా భవనానికి నష్టం వాటిల్లినట్లు చూపించే ఒక్క ఫోటోను నాకు చూపించండి అని ప్రశ్నించారు. మన దేశంలో ఒక్క గాజు ముక్క కూడా పగిలిపోలేదు. విదేశీ మీడియాలు తప్పుడు నివేదికలు ఇచ్చాయని మండిపడ్డారు.

## ఇంజనీరింగ్ కళాశాలలకు హైకోర్టులో చుక్కెదురు..!




**హైదరాబాద్,జూలై,11,తెలంగాణ దిశ:** ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలకు హైకోర్టులో చుక్కెదురయింది. ఫీజులు పెంచాలని దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. ఫీజుల పెంపు కోసం ఇచ్చిన విన తులపై ఫీజుల నియంత్రణ కమి టికి(టిఎఎఫ్‌ఆర్‌సి) ఆరు వారాల్లో నిర్ణయం తీసుకుని ప్రభుత్వా నికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించింది. ఫీజుల పెంచడాన్ని ప్రభుత్వ నిరాకరణను సవాల్ చేస్తూ సుమారు 11 ఇంజనీరింగ్ కళాశాలలు పిటిషన్లు దాఖలు చేశారు. తాజాగా శుక్రవారం మరోసారి విచారణ చేపట్టిన జస్టిస్ కె. లక్ష్మణ్ ధర్మాసనం ప్రైవేటు కళాశాలల పిటిషన్లు కొట్టివేసింది.

## చిన్నారి మృతికి కారణమైన ప్రభుత్వ ఆసుపత్రి

# డాక్టర్, స్టాఫ్ నర్సులను సస్పెండ్ చేయాలి

**మల్లాపూర్, జూలై 11, (తెలంగాణ దిశ) :**
మల్లాపూర్ బాబానగర్ కు చెందిన గుడిసె కవిత గురువారం మల్లాపూర్ సూర్య నగర్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి డెలివరీ కొరకు సాయంత్రం ఐదున్నర గంటలకు వెళ్ళింది. డ్యూటీలో ఉన్న డాక్టర్లు నిర్లక్ష్యంగా స్టాఫ్ నర్స్ తో డెలివరీ చేయించడంతో పాప మృతి చెందింది, సదరు డాక్టర్, స్టాఫ్ నర్సు నిర్లక్ష్యం కారణంగానే చిన్నారి మృతి చెందిందని ఆరోపిస్తూ,సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆసుపత్రి ఎదుట సీపీఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఉప్పల్ మండల సమితి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి. సత్య ప్రసాద్ లు సంయుక్తంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు విధుల్లో నిర్లక్ష్యం వ్యవహరించడం మూలంగానే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజలకు యమపాశాలుగా మారాయనడానికి ఈ ఘటన తార్కాణంగా మారిందని ధ్వజమెత్తారు.

మల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాఫ్ నర్సు ఇప్పటివరకు 75కు పైగా డెలివరీలు చేశానని బాహాటంగా చెబుతుందంటే, ఈ ఆసుపత్రిలో డాక్టర్ సేవలు నిరుపయోగమనే భావన వ్యక్తం అవుతుందన్నారు.



**- నర్సుతో డెలివరీ చేయించిన డాక్టర్... శిశువు మృతి...**
**- చిన్నారి మృతిపై వైద్య శాఖ సమగ్ర విచారణ జరపాలి..**



చిన్నారి ఘటన విషయంలో స్టాఫ్ నర్సు అన్నీ తానై, డాక్టర్ కు సమాచారం ఇచ్చినా సమయానికి రాకపోవడంతో వల్లనే చిన్నారి మరణించిందని వారు ఆరోపించారు.

ఈ ఆసుపత్రిలో గతంలోనే అనేక ఘటనలు జరిగాయని, కుక్క కాటుకు రాబీస్ టీకా లేకపోవడం,సిబ్బంది, డాక్టర్లు సమయానికి రాకపోవడం వంటి ఘటనలు జరిగాయన్నారు.

ప్రజల పట్ల, పేషెంట్ ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఈ ఆసుపత్రికి సాధారణంగా మారిందని విమర్శించారు. తప్పును కప్పిపుచ్చుకోవడానికి డాక్టర్... మల్లాపూర్ ఆసుపత్రిలోనే మరణించిన చిన్నారిని, గాంధీ ఆసుపత్రికి తరలించారని ఆరోపించారు.

చిన్నారి మృతి ఘటనపై జిల్లా వైద్యశాఖ అధికార యంత్రాంగం సమగ్రమైన విచారణ జరిపి, ఘటనకు కారకులైన డాక్టర్, స్టాఫ్ నర్సులను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఈ ఘటనపై విచారణ జరపడానికి ఆసుపత్రికి వచ్చిన మేడ్చల్జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖ అధికారిని సత్యవతికి సంఘాల పక్షాన ఫిర్యాదు చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు అజీమ్ పాషా, మహిళా సమాఖ్య నాయకురాలు మేరీ, స్వర్ణ, కావ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శ..., ఆర్థిక సహాయం



**కాప్రా, జూలై 11, తెలంగాణ దిశ)** :అనారోగ్యంతో బాధపడుతూ సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాప్రా కు చెందిన కైసర్ ను టిఆర్ఎస్ యువజన సంఘం నాయకుడు గోగికార్ శివకుమార్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రూ. ఆరు వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ కష్టాలలో ఉన్న పేదలను ఆదుకునేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇబ్బందుల్లో ఉన్న తమకు సహాయం చేసిన శివకుమార్ ను కైసర్ కుటుంబ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మణికంఠ నర్సింగ్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్కూలు బస్సు ఢీ కొని విద్యార్థికి తీవ్ర గాయాలు



**కుషాయిగూడ, జూలై 11, (తెలంగాణ దిశ)** :కుషాయిగూడలోని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ సమీపంలో ఇదే స్కూల్ బస్సు ఢీకొని విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఇదే పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న చైతన్య శ్రీ సూర్య గోపిశెట్టి కుషాయిగూడ సుభాష్ చంద్ర నగర్ కాలనీ నుంచి సైకిల్ పై స్కూలుకు వస్తుండగా టిఎస్ 08యు1780 బస్సు ఢీ కొట్టడంతో పాటు విద్యార్థి చేతిపై నుంచి బస్సు టైర్ వెళ్ళింది. దీంతో బాలుడిని యశోద ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. యజమాన్యం నిర్లక్ష్యం పట్ల విద్యార్థి బంధువులు స్కూల్ ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి నచ్చ చెప్పారు.

# ప్రతి ఒక్కరూ ప్రణాళిక అబద్ధమైన జీవితంపై అవగాహన కలిగి ఉండాలి




**- ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం**





**మేడ్చల్ కలెక్టరేట్, జూలై 11, (తెలంగాణ దిశ)** :ప్రతి ఒక్కరికీ సమర్థమైన ఆరోగ్య, విద్య, ప్రణాళిక బద్ధమైన కుటుంబ జీవితంపై అవగాహన అవసరమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సి. ఉమాగౌరీ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం షామీర్ పేట్ మండలం అంతాయిపల్లిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రపంచ జనాభా దినోత్సవం - 2025 వేడుకల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉమాగౌరీ మాట్లాడుతూ జనాభా పెరుగుదల అంటే కేవలం గణాంకాలు కాదని, మన భవిష్యత్తు పట్ల ఉండవలసిన బాధ్యతను సూచిస్తుందన్నారు. కుటుంబ నియంత్రణ సమాజ భద్రతకు, మాతా-శిశు ఆరోగ్యం, భవిష్యత్ తరాల ఆరోగ్యానికి, గర్భ నిరోధక సాధనాల వినియోగం వ్యక్తిగత నిర్ణయాధికారానికి ప్రతిరూపంగా నిలుస్తాయని వివరించారు. పెరుగుతున్న జనాభా వనరులపై ఒత్తిడిని పెంచి ఆహారం, నీరు, ఆరోగ్యం, విద్య వంటి ప్రాథమిక అవసరాలపై ప్రభావం చూపుతోందని అన్నారు. దీని వల్ల నిరుద్యోగం, పేదరికం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని అన్నారు. ఇలాంటి సందర్భాలలో ప్రతి ఒక్కరికీ సమర్థమైన ఆరోగ్య, విద్య, ప్రణాళిక బద్ధమైన కుటుంబ జీవితం మీద అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య శాఖలో విశిష్ట సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను, జ్ఞాపకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ మల్కాజిగిరి, కీసర డివిజన్ ఉప జిల్లా వైద్యాధికారులు డాక్టర్ శోభ, డాక్టర్ సత్యవతి, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ చంద్రకళ, డాక్టర్ గీత, డాక్టర్ మల్లేశ్వరి, డాక్టర్ కౌశిక్, సూపర్ వైజర్ విజయ్ కుమార్, లింగాల అక్షయ్ కుమార్, కమల్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్ రావునగర్ లో గెలాక్సీ డెంటల్ కేర్ హాస్పిటల్ ప్రారంభం

**- కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి**





**ఏఎస్ రావునగర్, జూలై 11, (తెలంగాణ దిశ)** :కాప్రా సర్కిల్ డాక్టర్ ఏఎస్ రావునగర్ లో గెలాక్సీ డెంటల్ కేర్ హాస్పిటల్ ను శుక్రవారం డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, మాజీ జెడ్ పిటిసి సింగం సత్తయ్యతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన గావించారు. అనంతరం అతిధులను ఆసుపత్రి నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ దంత సంరక్షణ విషయంలో మెరుగైన సేవలను అందించేందుకు అత్యాధునిక తరహాలో వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. నగరంలో 6 బ్రాంచ్ లతో దంత వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ స్థాయి దంత వైద్య సేవలను స్థానికులకు అందించనున్నట్లు తెలిపారు. ఇందు కోసం ఇంప్లాంట్లు, అలైనర్లు, కాస్మెటిక్ డెంటిస్ట్రీ నిపుణులతో సహా 30కి పైగా అనుభవజ్ఞులైన వైద్యులు ఉన్నారని తెలిపారు. తాజా సాంకేతిక పరిజ్ఞానంతో కఠినమైన అంతర్జాతీయ స్టెరిలైజేషన్ ప్రమాణాలను అనుసరిస్తామని తెలిపారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు మెరుగైన దంత సేవలను అందిస్తామన్నారు. వేలాది రోగులు మా నాణ్యత, నిబద్ధత పట్ల ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. ఆరోగ్యకరమైన, అందమైన, నమ్మకమైన సేవలను అందిస్తామని తెలిపారు. సౌకర్యం, భద్రతలకు ప్రథమ ప్రాధాన్యతనిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సోమశేఖర్ రెడ్డి, కాసం మహిపాల్ రెడ్డి, పెద్దాపురం కుమారస్వామి, బేతాల బాలరాజు, రాజిరెడ్డి, అతిధి రాజు, ఎస్ఏ. అబ్దుల్ రహీమ్, నాను, చిన్నారావు, గోలి శ్రీనివాస్, సత్యనారాయణ, సుధాకర్, వైద్యుల డాక్టర్ సుధాకర్ రావు, డాక్టర్ సుప్రజ, డాక్టర్ వీణ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు క్యాబినెట్ ఆమోదం పట్ల హర్షణీయం





**కుత్బుల్లాపూర్, జూలై 11, (తెలంగాణ దిశ)** :స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా నేతలు హర్షం ప్రకటించారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లి ఎస్ఎంఆర్ గార్డెన్స్ లో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జిల్లా ముఖ్యుల సమావేశానికి తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, బడంగ్ పేట్ మాజీ మేయర్ పారిజాత నరసింహారెడ్డి, కో - ఆర్డినేటర్లు శశికళ యాదవరెడ్డి, గజ్జెల కాంతం, ఎపి. మిథున్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి, టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మలిపెద్ది సుధీర్ రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, నియోజకవర్గ ఇంచార్జీలు బండి రమేష్, తోటకూర వజ్రేష్ యాదవ్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం





**కుత్బుల్లాపూర్, జూలై 11, (తెలంగాణ దిశ)** :బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశంలో తీర్మానం చేసిన సందర్భంగా రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి చిత్రపటాలకు శుక్రవారం కాంగ్రెస్ నేతలు పాలాభిషేకం నిర్వహించారు. లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆశయ సాధనలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించడంతో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, బడంగ్ పేట్ మాజీ మేయర్ పారిజాత నరసింహ రెడ్డి, మాజీ శాసన సభ్యులు సుధీర్ రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు దుర్గం భాస్కర్, ఎపి మిథున్ రెడ్డి, పీసరి మహేందర్ రెడ్డి, అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, టీపీసీసీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ నరసింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బాచుపల్లిలో కాంగ్రెస్ నేతల చిత్రపటాలకు పాలాభిషేకం

**కుత్బుల్లాపూర్, జూలై 11, (తెలంగాణ దిశ)** :బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన క్యాబినెట్ సమావేశంలో తీర్మానం చేసిన సందర్భంగా కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నేతలు కాంగ్రెస్ అధినేతల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆశయ సాధనలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించినట్లు కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి తెలిపారు. నిజాంపేట్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ అగ్రనేత నాయకులు రాహుల్ గాంధీ, అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు అనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి నాయకులతో కలసి పాలాభిషేకం చేశారు.



# సంపాదకీయం

## సంక్షేమం పేరుతో.. దివాళా తీయిస్తే ఎలా?

సంక్షేమం పేరుతో ఉచిత పథకాలు అమలు చేయమని చెప్పిందెవరు..ఉచిత బియ్యాలు, ఉచిత పందేరాలు... 58 ఏళ్లకే పెన్షన్లు...రాజకీయ నాయకులకు జీతభత్యాలు..ఇవన్నీ ఎవరి కోసం..ప్రజలు కట్టిన పన్నులతో పాటన చేయాల్సిన నేతలు రాష్ట్రాలను దివాళా తీయించేస్తున్నారు. అభివృద్ధి అంటే పెన్షన్లు పంచడం, సన్నబియ్యం పంచడం ఇదేనా..ఇవన్నీ నిలదీయడానికి ప్రజలంతా సిద్ధం కావాలి. ఎపి కావచ్చు.. తెలంగాణ కావచ్చు....ధరల గురించి మాట్లాడరు. అభివృద్ధి గురించి మాట్లాడరు. వారి సెక్యూరిటీ, ఆకాశ హర్మ్యాలను నిర్మించుకోవడం...ప్రజల డబ్బుతో సోకులు చేసుకోవడం ఇదా పాలన అంటే..అన్నది ప్రజలంతా ఆలోచించాలి. జగన్ తన హయాంలో రాజధాని, పోలవరం నిర్మాణాలను పక్కన పెట్టారు. విశాఖ భీమిలి దగ్గర మాత్రం అద్భుత సౌధాలను నిర్మించుకున్నారు. దీనికి నాటి పాలకులు నేటికీ సమర్థించు కుంటున్నారు. ఇంతకన్నా దౌర్భాగ్యం ఉండదు. ఇలాంటి పాలకులు అవసరమా అని ఆలోచన చేయాలి. రాష్ట్రాలను అప్పుల్లో కూరుకు పోయేలా చేసి...దివాళా తీయించిన నేతలు నీతి వాక్యాలు పలుకుతున్నారు. అభివృద్ధి చేశామని గొప్పులు చెప్పుకుంటున్నారు. సకాలంలో ధాన్యం కొనుగోళ్లు చేయరు. మిర్చి పండితే కొనుగోలు చేయలేరు. విద్యుత్, వైద్యం, విద్యారంగాలను పటిషంట చేయరు. ఇవన్నీ మరచి పందేరాలు చేస్తున్న ...వీరా మన పాలకులు ..అయినందుకు సిగ్గు పడాలి. ఇక తాజాగా హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని నిస్సిగ్గుగా అమ్మాలనుకోవడం రేవంత్ ప్రభుత్వ దివాళాకోరు విధానం కాక మరోటి కాదు. పెన్షన్లు, ఉచిత బస్సు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు ఎవరు అడిగారు. ఇవ్వడానికి డబ్బులు ఉన్నాయో లేదో ఆలోచించకుండా ఇష్టారీతిన హామీలు ఇచ్చి ఇప్పుడు భూములు, ఆస్తులు తెగనమ్మితే ఎలా. నీతులు పలుకుతున్న గత బిఆర్ఎస్ పాలకులు కూడా ఇంతకన్నా భిన్నంగా చేయలేదు. వారి హయాంలోనూ భూములు అమ్ముకున్నారు. పేదలు ఇళ్లు కొనగలిగేలా పరిస్థితులు ఉంటే మూసీ మురికిలో ఎందుకు నివసిస్తారు. మూసీ సుందరీకరణ పేరుతో వారిని నిర్వాసితులను చేయడం ఎంతవరకు సమంజసం. మూసీ సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ పేరిట పేదల ఇళ్లు కూల్చడం ఎంతవరకు సబబు. లగచర్లలో ఫార్మా పేరుతో దాడులు జరిగాయి. అభివృద్ధి పేరుతో గిరిజన తండాలపైకి వెళ్లారు. పాలకులు పక్కా రియల్ ఏజెంట్లలాగా మారితే ఇక రక్షించేదెవరన్నది గుర్తించాలి. చెప్పిన పథకాల అమలుకు, ఖజానా నింపుకోవడమే కాంగ్రెస్ నాయకులు హెచ్‌సియూ భూములను అమ్ముకుంటామంటే ఎలా! హెచ్‌సియూ భూములు అమ్మకాన్ని ఎవ్వరైనా తీవ్రంగా తప్పు పట్టాల్సిందే. హైదరాబాద్‌లో హెచ్‌సీయూ పరిసర ప్రాంతాలే కాస్త ఆక్సిజన్ ఇచ్చే ప్రాంతాలుగా ఉన్నాయి. వీటిని కూడా లేకుండా చేస్తామనే దుర్మార్గపు ఆలోచన సరికాదు. 400 ఎకరాలు అమ్మి.. రూ.30వేల కోట్లు రాబట్టుకోవాలని అధికార పార్టీ నేతలు చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలి. చ్‌సీయూ విద్యార్థుల పోరాటానికి అందరూ అండగా నిలవడం ద్వారా విలువైన భూములను కాపాడాలి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం పాటుపడుతున్న విద్యార్థులపైన ప్రభుత్వం అణచివేతకు పాల్పడడం తగదు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ దేశంలో పేరు ప్రఖ్యాతలు సాధించుకుంది. అక్కడ చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో గొప్పగా రాణిస్తున్నారు. దేశానికి తలమానికంగా ఉన్న విద్యాసంస్థల్లో ఒకటిగా ఉంది. హైదరాబాద్ నగర భవిష్యత్తు కోసం విశ్వవిద్యాలయ భవిష్యత్తు కోసం భూముల వేలం తగదని ప్రభుత్వం పెద్దలు గుర్తించాలి. భూములు ప్రభుత్వానివే అని చెబుతున్న సిఎం, మంత్రులు వాటిని రక్షించేందుకు చర్యలు తీసుకోవాలి. వాటిని అన్యాక్రాంతం కాకుండా చూడాలి. యూనివర్సిటీ భూములపైన రాజకీయం చేస్తున్న తీరు మంచిది కాదు. బుల్డోజర్లను పెట్టి అక్కడున్న చెట్లను తొలగించి చదును చయడం సరికాదు. హైదరాబాద్‌కి ఊపిరినిచ్చే కొన్ని గ్రీన్ ప్రాంతాలలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, దాని చుట్టూ ఉన్న ప్రాంతాలే. ఇప్పటికే కొండలు, గుట్టలను మాయం చేస్తున్నారు. హైదరాబాద్లోఓ ఇప్పటికే కొండలు గుట్టలు మాయం అయ్యాయి. ఎక్కడపడితే అక్కడ ఇవి ధ్వంసం చేయడం సరికాదు. వీటిని కూడా ఆపాలి. ఇలాచేస్తూ పోతే భవిష్యత్తులో ఢిల్లీ మాదిరి ఊపిరి పీల్చుకోవడమే కష్టం అయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. పర్యావరణ నష్టం ప్రభావంపై అధ్యయనం చేయాలి. ఇప్పటికే హైదరాబాద్‌లో వేల ఎకరాలు మాయం అయ్యాయి. పర్యావరణ విధ్వంసాన్ని వెంటనే ఆపాలని రేవంత్ ప్రభుత్వానికి రాజకీయపార్టీలు కూడా సూచించాయి. పచ్చదనం, జీవవైవిధ్యాన్ని నాశనం చేయడం సరికాదని పాలకులు గుర్తించాలి. నిధుల సమీకరణ కోసం ఈ తరహా చర్యలు చేపట్టడం కూడా మంచిది కాదు. ముందుగా ఉచిత పథకాలను సమీక్షించాలి. నష్టాలను తెచ్చే పథకాల్లో కోతలు విధించుకోవాలి. అప్పులకు,భేషజాలకు పోకుండా ఉన్న ఆదాయంతోనే ప్రభుత్వాన్ని నడపాలి. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోంచి బయటపడేయాలంటే అమ్మకాలు.. కాదు ఆస్తులు సృష్టించాలి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విశ్వవిద్యాలయం భూముల అమ్మకం ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలి. విద్యార్థులు, అధ్యాపకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్ళడం సరికాదు. ఇప్పటికే హైదరాబాద్‌లో శ్మశానవాటికలకు కూడా జాగా దొరకని పరిస్థితి వచ్చింది. పార్కులకు సైతం స్థలం లేక కాంక్రీట్ జంగల్‌గా మారుతోంది. హైదరాబాద్ లో కబ్జాలను గుర్తించి ముందుగా వాటిని విముక్తం చేయాలి. చెరువులు కబ్జాలను గుర్తించాలి. అందుకు హైడ్రా చేస్తున్న కృషిని మరింతగా ప్రోత్సహించాలి. హైదరాబాద్ నగరంతో పాటు చుట్టుపక్కల కబ్జాలను గుర్తించి, ఆ భూములను స్వాధీనం చేసుకోవాలి. డబ్బులను వృధా చేసే ఓట్ల పథకాలకు పాతరేసినప్పుడే రాష్ట్రం అప్పుల ఊబినుంచి బయటపడగలదు. ఇది చంద్రబాబుకైనా మరెవ్వరికైనా వర్తిస్తుంది. సంక్షేమం పేరుతో అప్పులు చేసి, పందేరాలు చేయడం ఎంతమాత్రం కాదు. ఫ్రీ పథకాలను ఇకనైనా సమీక్షించడం క్షేమకరం.

# శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి కొలువు తీరిన నూతన పాలక మండలి

## - ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి : పరమేశ్వర్ రెడ్డి








**కుషాయిగూడ, జూలై 11, (తెలంగాణ దిశ)** :కుషాయిగూడ పద్మావతి వెంకటేశ్వర స్వామి నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవాలయం ఫౌండర్ ట్రస్ట్ గా పల్లె యాదగిరి రెడ్డి వ్యవహరిస్తున్నారు. ధర్మకర్తలుగా సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, బీరంకొండ గోపాల్, తాళ్లపల్లి మేఘరాజ్, మైలారపు సదానందం, ఉద్గారి శ్రీనివాసులు, నల్లచెరువుల రాకేష్, కాశిరెడ్డి సుజిత రెడ్డి, ఇందూరు రమాదేవి, సారా వినోద్ కుమార్, మోర మోహన్ రెడ్డి, గండాల క్రాంతి కుమార్, మైలారం బాల నరసింహ, సింగిరెడ్డి బలవంత రెడ్డిలు ప్రమాణ స్వీకారం చేశారు. నూతనంగా నియమితులైన ధర్మ కర్తలు శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి బాధ్యతతో కృషి చేయాలని పరమేశ్వర్ రెడ్డి సూచించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృధి పదంలో ముందుకు సాగుతుందని అనరు. ఆలయ అభివృద్ధికి సంక్షేమానికి ప్రభుత్వం ద్వారా నిధుల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ధనపాల్ రెడ్డి, పజ్జూరి పావని రెడ్డి, కొత్త అంజిరెడ్డి, కె. సీతారాం రెడ్డి, కాసుల పోచయ్య గౌడ్, పెద్ది నాగరాజు, పెద్ది శ్రీనివాస్,బాల్ రెడ్డి, వంశీ, సర్ఫరాజ్, నాగ శేషు, ప్రసాద్, రఘు, ప్రకాష్ రెడ్డి, వెంకట్ గౌడ్, పూర్ణ, సతీష్, శంకర్, శ్రీనివాస్, విజయ్ ముదిరాజ్, బాబు ముదిరాజ్, శివ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, ముత్యాలు, శ్యామ్, అశోక్, నీరజారెడ్డి, నిర్మలా,సంధ్య, అరుణ, గిరిజ, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో

## - భాగంగా తడి, పొడి చెత్త పై అవగాహన



**దమ్మాయిగూడ, జూలై 11, (తెలంగాణ దిశ)** :దమ్మాయిగూడలో వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం వివిధ కార్యక్రమాలను చేపట్టారు. ఇందులో భాగంగా 4వ వార్డులోని విఆర్ఆర్ కాలనీలో డెంగ్యూ, మలేరియా సీజనల్ వ్యాధులు రాకుండా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ పొడి, తడి వ్యర్థాల వేరు చేయడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గృహ కంపోస్టింగ్ అవగాహన, గృహ స్థాయిలో సేంద్రీయ వ్యర్థాలను కంపోస్టింగ్ చేయడం ప్రోత్సహించడం, సింగిల్, యూజ్ ప్లాస్టిక్‌లను నివారించడంపై అవగాహన కల్పించారు. వర్షపు నీటి సేకరణ తనిఖీలు, వర్షపు నీరు వృధా కాకుండా అపార్ట్ మెంట్ ల వద్ద ఉన్న ఇంకుడు గుంతలను తనిఖీ చేసారు.వన మహోత్సవంలో భాగంగా చీర్యాల గ్రామంలో మున్సిపల్ సిబ్బంది సుమారు ఐదు వందల పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. అహ్మద్ గూడలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త, పొదలను తొలగించారు.కీసర లో భూగర్భ మురికి కాలువలను శుభ్రం చేయడంతో పాటు నాళాల్లో పూడిక తీశారు. ఏబిసి ప్రచారంలో భాగంగా జంతు జనన నియంత్రణ, స్టెరిలైజేషన్ టీకా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వాణిజ్య లైసెన్స్ లను పరిశీలన, పరిశీలించారు. భువన్ సర్వే, ఆస్తుల సర్వే నిర్వహణ, భువన్ యాప్ ద్వారా నమోదు చేసేందుకు మేనేజర్ ఎ. వెంకటేష్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి, మున్సిపల్ మేనేజర్ ఎ. వెంకటేషం, సానిటరీ ఇన్ స్పెక్టర్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.



# నూతన సీఐకి అభినందనలు




**కుత్బుల్లాపూర్, జూలై 11, (తెలంగాణ దిశ)** :బాచుపల్లి నూతన పోలీస్ ఇన్ స్పెక్టర్ గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన సతీష్ కుమార్ ను కాంగ్రెస్ నాయకురాలు రమణి శుక్రవారం అభినందించారు. ఇప్పటి వరకు బాచుపల్లి పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ గా పనిచేసిన సిఐ సైబరాబాద్ కు బదిలీ అయినట్లు తెలుస్తుంది. బాచుపల్లిలో శాంతి భద్రతల విషయంలో సమాజంలోని అన్ని వర్గాలను కలుపు కొని నూతన సీఐ మంచి పేరు గడించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నూతన సిఐ సతీష్ కుమార్ ను ఆమె ఘనంగా సన్మానించారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం చారిత్రాత్మకం

## - కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి

**మేడ్చల్ బ్యూరో, జూలై 11, (తెలంగాణ దిశ)** :లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆశయ సాధనలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, మంత్రివర్గం తీర్మానం చేసిన సందర్భంగా రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, బట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు శుక్రవారం బోయిన్ పల్లి లో పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జీ బండి రమేష్, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతి రెడ్డి, జిల్లా ఆర్టిఏ మెంబర్, కాంగ్రెస్ పార్టీ తూముకుంట మున్సిపల్ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి, షామీర్ పేట్ మండల అధ్యక్షులు యాష్కి శంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు సంజీవరెడ్డి, భాస్కరరావు, గడ్డం శ్రీనివాస్, వెంకటేష్, రవి, దేవేందర్ రెడ్డి, తుంకి రమేష్, హరీశ్, షామీర్ పేట్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నర్మద తదితరులు పాల్గొన్నారు.



# సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేయాలి

## - నియోజకవర్గాలలో పూర్తిస్థాయి కమిటీలను నియమించాలి

## ప్రభుత్వ సలహాదారులు జగ్గారెడ్డి



**హైదరాబాద్,జూలై 11, (తెలంగాణ దిశ)** :సంస్థ గతంగాకాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేయాలని కాంగ్రెస్ నేతలు నిర్ణయించారు. శుక్రవారం గాంధీభవన్ లో హైదరాబాద్ జిల్లాలోని ఐదు నియోజకవర్గలైన నాంపల్లి, గోషామహల్, ఖైరతాబాద్, అంబర్ పేట, కార్వాన్ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీలతో ప్రభుత్వ సలహాదారులు జగ్గారెడ్డి సమావేశమయ్యారు. టిపిసిసి ఉపాధ్యక్షులు సంగమేశ్వర్, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, సత్యం గౌడ్ లతో పాటు గోషా మహల్ నియోజకవర్గ ఇంచార్జ్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఆయా నియోజకవర్గాలలోని నియోజకవర్గ, బ్లాక్, డివిజన్, బూత్ స్థాయిలలో పార్టీ కార్యవర్గాలతో పాటు అనుబంధ విభాగాల కార్యవర్గాలను నియమించాలని నిర్ణయించారు.

# శివాలయంపై దాడి చేసిన వ్యక్తులను శిక్షించాలి



**కుత్బుల్లాపూర్, జూలై 11, (తెలంగాణ దిశ)** :గాజుల రామారం డివిజన్ కైసర్ నగర్ లో శివాలయ ఆలయంపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని స్థానిక బిజెపి నాయకులు, గాజుల రామారం డివిజన్ మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి కోరారు. శుక్రవారం ఆయన ఆలయాన్ని సందర్శించారు. దుండగుల దాడిలో ధ్వంసమైన విగ్రహాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేత, జిల్లా నాయకులు శ్రీనివాస్ రెడ్డి మురళీకృష్ణ ఆలయ కమిటీ సభ్యులు హరి కిషోర్ ఓబీసీ మోర్చా అసెంబ్లీ కో కన్వీనర్ బాలకృష్ణ, యువ మోర్చా నాయకులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# దోమల నివారణపై విజయ హైస్కూల్ విద్యార్థులకు అవగాహన సదస్సు






**కాప్రా, జూలై 11, (తెలంగాణ దిశ)** :దోమల నివారణపై కాప్రా మున్సిపాలిటీ ఎంటమాలోజీ విభాగం ఆధ్వర్యంలో కాప్రా ఆదిత్య నగర్ లోని విజయ హై స్కూల్ విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాప్రా మున్సిపాలిటీ అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ డి. రమేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ దోమలు నీరు నిల్వ ఉన్న చోట టైర్లు, కొబ్బరి బొండాలు, నీరు నిల్వ ఉన్న పూల కుండీలలో లార్వా ద్వారా 10 నుండి 12 రోజులలో దోమలు ఉత్పత్తి చెంది డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ లాంటి ప్రాణాంతక వ్యాధులను వ్యాప్తి చేస్తాయని అవగాహన కల్పించారు. దోమల నివారణకు ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు పాటించి ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకొని, నీరు నిల్వ లేకుండా దోమల వ్యాప్తి జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కొప్పునూరి రాజేశ్వర్, డైరెక్టర్ కొప్పునూరి వీణ, ప్రిన్సిపాల్ దేవినేని వెంగబాబు, ప్రధానోపాధ్యాయురాలు అద్దంకి పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య..!?

**కుత్బుల్లాపూర్, జూలై 11, తెలంగాణ దిశ)** :ఇంటర్ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతి నగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ప్రగతి నగర్ వాసుల కథనం ప్రకారం ప్రగతి నగర్ లోని ఐకాన్ ప్రైమ్ రోజ్ అపార్ట్మెంట్‌లో ఉన్న విశాంత్ (18) శుక్రవారం ఉదయం అదే అపార్ట్ మెంట్ఐదవ ఫ్లోర్ టెర్రస్ నుండి కిందికి దూకి ఆత్మహత్య యత్నం చేశాడు.ఐదవ అంతస్తు నుండి కిందకు దూకడంతో విశాంత్ తలకు,కాళ్ళు, చేతులకు,ఛాతి భాగంలో తీవ్ర గాయాలు అయినట్లు తెలుస్తోంది. దీంతో ఈ హఠాత్పరిణామానికి అప్రమత్తమైన ఐకాన్ ప్రైమ్ రోజ్ అపార్ట్ మెంట్ వాచ్ మెన్ అపార్ట్ మెంట్ వాసులను కేకలు వేసి పిలిచి విశాంత్ ను చికిత్స నిమిత్తం హుటాహుటిన స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విశాంత్ మరణించినట్లు తెలుస్తుంది. అయితే ఈ విషయమై బాచుపల్లి పోలీసులు శుక్రవారం సాయంత్రం వరకు ఎలాంటి సమాచారాన్ని అధికారికంగా ధ్రువీకరించలేదు.

# ఏఎస్ రావునగర్ లో తొలి రోబోటిక్ అమెరికన్ లేజర్ కంటి శస్త్ర చికిత్స కేంద్రం ప్రారంభం





**ఏఎస్‌రావునగర్,జులై 11,(తెలంగాణ దిశ) :** ఏఎస్ రావునగర్ భీమా జ్యువెలర్స్ పైన యాస్మాయ్ ఆర్కేడ్ లో తొలి రోబోటిక్ అమెరికన్ లేజర్ కంటి శస్త్ర చికిత్స కేంద్రాన్ని ప్రముఖ సినీ నటి అర్చన శాస్త్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగాజ్యోతి ప్రజ్వలన గావించారు. అనంతరం అర్చన శాస్త్రి మాట్లాడుతూ అమెరికన్ లేజర్ కంటి ఆసుపత్రిని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కేవలం ఒక బ్రాండ్ ప్రమోట్ చేయడం సాధారణ విషయమేనని, అయితే నేను, మా అమ్మ ఈ ఆసుపత్రికి చెకప్ కోసం వచ్చామని, ఇక్కడి వాతావరణం చాలా బాగుందని, ఇక్కడి వైద్యులు, సిబ్బంది ఎంతో కేర్ తీసుకుని వైద్యం చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా అమెరికన్ లేజర్ కంటి ఆసుపత్రి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్ లో మరిన్ని శాఖలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించి దినదినాభివృద్ధి చెందాలని అర్చన శాస్త్రి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అమెరికన్ రోబోటిక్ కంటి ఆసుపత్రి నిర్వాహకులు మాట్లాడుతూ నేత్ర వైద్య రంగంలో దార్శనికుడైన రమేష్ చంద్ర ఆసుపత్రిని స్థాపించారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రపంచస్థాయి కంటి సంరక్షణ అందించడమే లక్ష్యమని తెలిపారు. అధునాతన చికిత్సలను సరసమైన ధరలకే అందిస్తూ అత్యాధునిక సాంకేతికతను సమాజంలోని అన్ని వర్గాలకు అందుబాటులో ఉంచి వైద్య ఖర్చుల అంతరాన్ని తొలగించడమే ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. సాంకేతికతతో పనిచేసే రోబోటిక్ లాసిక్ శస్త్ర చికిత్సను ప్రవేశ పెట్టమ ని, రోబోటిక్ క్యాటరాక్ట్ శస్త్రచికిత్సను అందుబాటులోకి తెచ్చామన్నారు. అమెరికన్ లేజర్ హాస్పిటల్స్ డైరెక్టర్ సీఈఓ జగదీష్ మాట్లాడుతూ ఏఎస్. రావు నగర్ లో అధునాతన కంటిఆసుపత్రిని ప్రారంభించడం గర్వకారణం అన్నారు. అన్ని వయసుల వారికి కళ్ళజోడు లేని నొప్పి లేని కచ్చితమైన దృష్టిని పొందే శక్తి ఇస్తున్నామన్నారు. లాసిక్ శస్త్ర చికిత్స విప్లవం, రోబోటిక్ క్యాటరాక్ట్ శస్త్రచికిత్స, పాన్ ఇండియా దృష్టితో తెలుగు బ్రాండ్ తో బ్లేడ్ లెస్ అత్యంత కచ్చితమైన సాంకేతికత, ప్రత్యేక లెన్స్, విస్తృత సేవలు,రాజీ పడకుండా అందరికీ ఉత్తమ కంటిచూపును అందించాలనే లక్ష్యంతో కంటి ఆసుపత్రిని ఏర్పాటు చేశామన్నారు. లైఫ్ లైన్ హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎ. శ్రీనివాస్, బార్ అసోసియేషన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు అమరేందర్ రెడ్డి, అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్స్ క్లినికల్ హెడ్ డాక్టర్ అఫ్తాబ్ అబ్దుల్, అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్స్ సిఎంఓ డాక్టర్ నమ్రత తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ చారిత్రాత్మక నిర్ణయం

## జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి



**హైదరాబాద్, జూలై 11, (తెలంగాణ దిశ) :**తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే ఆర్డినెన్స్ రావడాన్ని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి స్వాగతించారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం సామాజిక న్యాయ పోరాటానికి దిక్సూచి కాగా, బీసీ సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రాతినిధ్యాన్ని బలోపేతం చేసే దిశగా ఒక మలుపు కావడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, బీసీ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ లకు దుండ్ర కుమారస్వామి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సెక్రటేరియట్ మీడియా సెంటర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దుండ్ర కుమారస్వామి మాట్లాడుతూ దశాబ్దాలుగా బీసీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అణచివేతకు గురయ్యారని అన్నారు. విద్య, ఆస్తి, అధికారాల్లో అత్యధికంగా నష్టపోయిన వర్గం బీసీలేనన్నారు. రాజ్యాంగ హక్కులు అమలుకాక, బీసీలు వెనుకబడ్డారని అన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో "జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు" కల్పించాలన్న స్పష్టత ఇచ్చారని గుర్తు చేశారు. ఆ తర్వాత కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ 42 శాతం రిజర్వేషన్లు, కులగణన హామీ ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జీవో నంబర్ 26 ద్వారా కులగణన ప్రారంభమై, బీసీ డెడికేటెడ్ కమిషన్ నియమితమైందన్నారు. రాష్ట్ర ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో కులగణన విజయవంతంగా పూర్తయిందన్నారు. మార్చి 2025లో 42 శాతం రిజర్వేషన్ల బిల్లులు అసెంబ్లీలో ఆమోదం పొందాయని అన్నారు. రాష్ట్రపతి ఆమోదం ఆలస్యం కావడం, కేంద్ర నిర్లక్ష్యం వైఖరికి నిదర్శనమన్నారు. హైకోర్టు 30 రోజుల్లో రిజర్వేషన్ల ఖరారు చేయాలని ఆదేశించిన నేపథ్యంలో ప్రభుత్వం చారిత్రాత్మక ఆర్డినెన్స్ తీసుకొచ్చిందన్నారు. పంచాయతీరాజ్ చట్టం%-%2018కు సవరణ ద్వారా సెక్షన్ 285(ఏ)లోని రిజర్వేషన్ సీలింగ్ తొలగింపు ద్వారా ఎంపిరికల్ డేటా ఆధారంగా 42 శాతం రిజర్వేషన్ల ఖరారు చేస్తా అనడం సంతోషమని తెలిపారు. న్యాయపరమైన చిక్కుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి తెలిపారు. ఇది ఒక సామాజిక విప్లవం, ఇది బీసీల ఆత్మగౌరవానికి, ప్రతీకగా నిలిచే నిర్ణయమని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలబెట్టిన ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలో సామాజిక న్యాయం

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన





**నాగారం, జూలై 11, (తెలంగాణ దిశ)** :నాగారం పురపాలక సంఘ పరిధిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వంద రోజుల ప్రణాళికలో 40వ రోజు శుక్రవారం ఆరోగ్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. గోధుమకుంట వార్డు కార్యాలయంలో ఈసీఐఎల్ జీనీయ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ హెల్త్ క్యాంప్‌లో నాగారం పురపాలక సంఘ సానిటేషన్ సిబ్బంది సహా 100 మందికి పైగా గ్రామస్తులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్య శిబిరంలో కంటి పరీక్ష, దంత పరిక్ష, ఇసిజి, షుగర్, బ్లడ్ ప్రెజర్ తదితర పరీక్షలను అనుభవజ్ఞులైన వైద్యులు నిర్వహించారు. అంతేకాక అవసరమైన మందుల పంపిణీ చేశారు. స్థానికులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంలో ఈ కార్యక్రమం కీలకంగా నిలిచింది. నాగారం పురపాలకసంఘ పరిధిలోని అన్ని వార్డుల వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ 100 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతిరోజూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వార్డు స్థాయిలలో అభివృద్ధి పనులు సమర్థవంతంగా ప్రణాళికాబద్ధంగా కొనసాగుతున్నాయని కమిషనర్ ఎస్. భాస్కర్ రెడ్డి తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ ధర్మా రెడ్డి, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ఎ. బాబు, అన్ని వార్డుల వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, జీనియ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# బస్తీ బాట సమస్యల పరిష్కారం కోసం కృషి : నెమలి అనిల్ కుమార్





**మల్లాపూర్, జూలై 11, (తెలంగాణ దిశ) :**"బస్తీ బాట" కార్యక్రమంలో భాగంగా తెలుసుకున్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం మల్లాపూర్ డివిజన్ పఠాన్ బస్తీలో పర్యటించారు. మంచినీటి సమస్యను పరిష్కరించాలని జలమండలి అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మల్లాపూర్ ప్రధాన కార్యదర్శి టి. శ్రీకాంత్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి వి. శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురేష్ గౌడ్, అన్వర్, వెంకట్, ఇబ్రహీం, ఇస్రాత్ బానో తదితరులు పాల్గొన్నారు.

# ఇక అందరికి బయోమెట్రిక్...




**హైదరాబాద్,తెలంగాణ దిశ:**ప్రభుత్వ కార్యాలయాలలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇక క్రమశిక్షణ పద్ధతులు అమలుచేయనున్నారా? సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారా? అవును నిజమే రాష్ట్రవ్యాప్తంగా ఇకపై అన్ని గవర్నమెంట్ ఆఫీసుల్లో బయోమెట్రిక్ హాజరును అమలుచేయాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారని సమాచారం. సచివాలయం సిబ్బంది ప్రతిరోజూ కార్యాలయం లోపలకి, బయటకు వెళ్లేటప్పుడు బయోమెట్రిక్ పంచ్ తప్పనిసరిగా చేయాలనే యోచనలో రేవంత్ సర్కార్ ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలలో చర్చ జరుగుతోంది. అయితే ఈ పంచింగ్ సిస్టమ్ సీఎం కూ వర్తిస్తుందని సీఎం టూ అటెండర్ వరకూ తప్పనిసరిగా బయోమెట్రిక్ థంబ్ నైల్ ఉండబోతోందని సమాచారం. ఉద్యోగుల్లో క్రమశిక్షణ, జవాబుదారీతనం పెంచేందుకు బయోమెట్రిక్ హాజరును తప్పనిసరి చేయాలని సీఎం యోచిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వ ఉద్యోగులపై వచ్చిన విమర్శలను సీఎం సీరియస్‌గా తీసుకున్న సంగతి తెలిసిందే. దీంతో ముందుగా సచివాలయంలో బయోమెట్రిక్ హాజరు అమలు చేయాలని సీఎస్ శాంతికుమారికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ప్రతి ఒక్కరికీ బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేయాలని యోచిస్తున్నామన్నారు. ఫలితంగా మంత్రులు, ఐఏఎస్‌లు, సచివాలయ ఉద్యోగులకు కూడా పంచ్‌లు చేయాల్సి ఉంటుందని సీఎం తన సన్నిహితులతో అన్నట్లు సమాచారం. సీఎం, సీఎస్, మంత్రులందరూ బయోమెట్రిక్ హాజరును పాటిస్తున్నందున కిందిస్థాయి ఉద్యోగుల విమర్శలకు ఆస్కారం ఉండదని సీఎం భావిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరును తప్పనిసరి చేయాలని సీఎం కోరుతున్న సంగతి తెలిసిందే. కార్యాలయానికి వచ్చినప్పుడు, ఇంటికి వెళ్లేటప్పుడు కూడా పంచ్‌లు వేస్తే ప్రభుత్వ ఉద్యోగులపై ప్రజల్లో ఉన్న ప్రతికూల అభిప్రాయం తొలగిపోతుందని సీఎం అభిప్రాయపడినట్లు సమాచారం. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరును అమలు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించడం చర్చనీయాంశమవుతోంది. బయోమెట్రిక్ వల్ల ఉద్యోగులపై నిఘా, పనుల్లో వేగం పెంచడంతోపాటు ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించే అవకాశం ఉందని సీనియర్ ఐఏఎస్ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. అయితే మొదట్లో ఉద్యోగుల నుంచి విమర్శలు వచ్చినా.. చివరికి ప్రజల నుంచి ప్రశంసలు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# వృద్ధిచెందిన భూగర్భ జలాలు తీరుతున్న వన్య ప్రాణుల దాహార్తి



**కమ్మర్‌పల్లి,,తెలంగాణ దిశ:** మండలంలోని కోనాపూర్ శివారులో నిర్మించిన రాళ్లవాగు స్థానిక రైతుల ధీమాను పెంచుతున్నది. ప్రాజెక్టు నిర్మాణంతో వానకాల ంతోపాటు యాసంగిలోనూ సాగునీటికి ఢోకా లేకుండా పోయింది. నిజామాబాద్, జగిత్యాల జిల్లాల సరిహద్దుల్లో నిర్మించిన రాళ్లవాగు ప్రాజెక్టు.. వానకాలంలో రెండు జిల్లాలకూ సాగునీరు అందిస్తుండగా, యాసంగిలో కోనాపూర్‌లో ఉన్న 200 ఎకరాలకు నీటి చింత లేకుండా చేస్తున్నది. ప్రాజెక్టు కారణంగా ఎండాకాలంలో వరిపంటలకు నీరు అందుతుండడంతోపాటు భూగర్భ జలాలు సైతం వృద్ధి చెందుతున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల్లో బోరుబావుల కింద పంటలు సాగుచేస్తున్న రైతులకు సైతం సాగునీటి ఇబ్బందులు దూరమయ్యాయి. రాళ్లవాగు చుట్టూ దట్టమైన అడవి, కొండలు, గుట్టలు ఉన్నాయి. ఇక్కడ నిత్యం వన్య ప్రాణులు సంచరిస్తాయి. ప్రాజెక్టు కారణంగా మండుటెండల్లోనూ వన్య ప్రాణుల దాహార్తి తీరుతున్నది. వానకాలంలో రాళ్లవాగు ప్రాజెక్టు ఉధృతంగా ప్రవహిస్తుంది. భారీ వర్షాలు కురిస్తే పొంగి పొర్లుతుంది. ఎగువన కిలోమీటర్ల దూరం నుంచి చిన్నచిన్న వాగులు, వంకలు, ఒర్రెలు కలిసి గట్టు పొడిచిన వాగును కలుపుకొని కోనాపూర్ శివారు గుండా ప్రవహించే రాళ్ల వాగుపై ప్రాజెక్టును నిర్మించారు. అప్పటి నుంచి వానాకాలంలో నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో సాగుచేసే 3500 ఎకరాలకు సాగు నీటిని అందించే కీలక ప్రాజెక్టుగా మారింది. లో కోనాపూర్ గ్రామంలో పంటలు సాగుచేసే రైతులకు వరంగా మారింది. సాగునీరు పుష్కలంగా అందుబాటులో ఉండడంతో స్థానిక రైతులు అధికంగా వరి సాగుపై దృష్టిపెట్టారు. కోనాపూర్ పరిధిలో ప్రస్తుత యాసంగిలో 200 ఎకరాలకు పైగా వరి సాగవుతున్నది. బోరు బావుల కింద సాగవుతున్న పంటలకూ ప్రాజెక్టు కారణంగా సాగునీరు అందుబాటులోకి వచ్చింది. రాళ్లవాగు ప్రాజెక్టు సమీపంలోని నిజామాబాద్-జగిత్యాల సరిహద్దు ప్రాంతాల్లో దట్టమైన అడవులు ఉన్నాయి. ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు వన్యప్రాణులకు నెలవు. .జింకలు, దుప్పులు, నెమళ్లు, అడవి పందులు తదితర వన్య ప్రాణుల సంచారం అధికంగా ఉంటుంది.

# బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ షురూ



**భూపాలపల్లి,తెలంగాణ దిశ:**జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మొదలైంది. పాఠశాల విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూల్ మేరకు జిల్లావిద్యాశాఖాధికారి కార్యాలయం ముందు ఉపాధ్యాయులతో సందడిగా మారింది. గత సెప్టెంబరులో ఈ ప్రక్రియ మొదలై అర్థాంతరంగా ఆగిపోయింది. తిరిగి కొనసాగడంతో ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రక్రియ ఈసారి సజావుగా సాగుతుందా.. మళ్లీ మధ్యలోనే ఆగిపోతుందా అని కొందరు ఆందోళన చెందుతున్నారు. సీనియారిటీ జాబితా పరిశీలన, సవరణలు, ఫిర్యాదులు సమర్పించడం, భాషా పండితులు, పీఈటీల పదోన్నతుల కోసం ధ్రువపత్రాల పరిశీలన కోసం జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి వందలాది మంది ఉపాధ్యాయులు తరలివచ్చారు. దీంతో డీఈవో కార్యాలయం ముందు భాగంలో పండితులు, పీఈటీలు ధ్రువపత్రాల పరిశీలనతో రద్దీగా మారింది. ఇది వరకే బదిలీ అయిన 188 మంది స్కూల్ అసిస్టెంట్లు రిలీవ్ అయి కొత్తగా బదిలీ అయిన పాఠశాలకు పరుగులు తీశారు. 19 ఏళ్లుగా ఎదురుచూస్తున్న భాషా పండితులు, పీఈటీ పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేస్తూ, రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ రెండు రోజుల క్రితమే ఉత్తర్వులు జారీ చేయడంతో సంబంధిత ఉపాధ్యాయ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఏయే పాఠశాలల్లో ఎన్ని పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయో చూపించే జాబితా సైతం విడుదల కావడంతో పదోన్నతి లభించే అవకాశం ఉందా.. వస్తే ఏ పాఠశాలలో లభిస్తుందనే దానిపై నిమగ్నమయ్యారు. సీనియర్లు, సంఘ నాయకులు అధికారులను అడిగి సందేహాలను తీర్చుకుంటు న్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో స్కూల్ అసిస్టెంట్ తత్సమాన పోస్టుల పదోన్నతులకు ఎస్జీటీల ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాను సిద్ధం చేశారు.

# ఆరోగ్య మందిర్‌లలో అదనపు సేవలు

**ధర్మపురి,తెలంగాణ దిశ:** గ్రామ స్థాయిలో వైద్య సేవలను విస్తరించేందుకు ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను పల్లె, బస్తీ దవాఖానాలుగా మార్చి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలుగా గుర్తించింది. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి ఉప కేంద్రాల్లోనే చికిత్స అందిస్తున్నారు. అవసరం మేరకు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రులకు తరలిస్తున్నారు. జిల్లాలో 151 ఆరోగ్య ఉప కేంద్రాలుండగా ఇప్పటికే 102 కేంద్రాలను ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలుగా గుర్తించి అందులో ఏడు రకాల వైద్య సేవలను అందిస్తున్నారు. రానున్నరోజుల్లో అన్ని ఉప కేంద్రాలను ఆరోగ్య కేంద్రా లుగా గుర్తించనున్నారు. తాజాగా ఉన్న ఆరోగ్య సేవలతో పాటు మరిన్ని ఆరోగ్య సేవలను విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# పంచాయతీలకు నిధులొస్తేనే ఊరట



చుంచుపల్లి,,తెలంగాణ దిశ:జిల్లాలో మొత్తం 481 పంచాయతీలున్నాయి. వీటికి రాష్ట్ర (ఎస్ఎఫ్సీ), లేదా 15వ ఆర్థిక సంఘం నిధులు నాలుగు నెలల కోసారి విడుదలయ్యేవి. ఎన్నికల కోడ్ కారణంగా ఈ ఏడాది జనవరి నుంచి పంచాయతీలకు కేంద్రం నుంచి నిధులు విడుదల కావడం లేదు. ప్రస్తుతం.. పైపులైన్ల లీకులు, బోర్లు, రహదారుల మరమ్మతులు, పంచాయతీ ట్రాక్టర్ రుణం రుణ వాయిదాలు, విద్యుత్తు బిల్లుల బకాయిలు, వీధిదీపాల నిర్వహణకు ఇబ్బందులు తప్పట్లేదు. ఇటీవల 'స్వచ్ఛదనం-పచ్చదనం'తో కాస్త హడావుడి చేశారు. కానీ రోజువారీ పారిశుద్ధ్య చర్యలు, ఇతర పనులకు తగినన్ని నిధుల్లేక పంచాయతీల కార్యదర్శులు జేబుల్లోంచి ఖర్చుపెట్టే పరిస్థితి నెలకొంది. ఇంటి పన్నుల వసూళ్లు సైతం అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. మొన్నటి వరకు మల్టీపర్పస్ కార్మికులకు వేతన బకాయిలు ఉండగా.. గత నెలలోనే 768మందికి రూ. 1.49కోట్లు మంజూరు చేశారు. దీంతో పాటే పెండి ంగ్‌లో ఉన్న పదిహేనో ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ. 14 కో ట్లు త్వరగా ఖాతాల్లో జమచేస్తేనే ఊరట దక్కే అవకాశం ఉంది. కొద్దిరోజులుగా జోరు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పల్లెల్లోని రహదారులు చిత్తడిగా మారాయి. కనీసం వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితి. దీంతో గ్రామస్థులే స్వచ్ఛందంగా ముందుకొచ్చి, సొంత ఖర్చులతో రోడ్లను మట్టితో చదును చేయించుకుంటున్నారు. గుంతలు పూడ్చివేయిస్తున్నారు. 'పంచాయ తీలకు నిధుల కొరత ఉ న్నా.. పారిశుద్ధ్య పనులకు ఇబ్బందుల్లేవు. మార్చి నెలలో ఎస్ఎఫ్సీ నిధులు కొన్ని రాగా.. కార్మికులకు వేతనాలిచ్చాం. 15వ ఆర్థిక సంఘం పెండింగ్ నిధులు జమ కానున్నట్లు సమాచారం ఉంది.

# దలారుల తీరుతో నష్టపోతున్న మిర్చి రైతు

**మేళ్లచెరువు,తెలంగాణ దిశ:**శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచిన మిర్చి రైతులకు నిరాశే ఎదురైంది. ధర పలుకుతుందని దాచిన రైతులకు పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు. సీజన్‌లో సరైన ధర లేక పలువురు రైతులు తమ మిరప పంటను జిల్లాలోని శీతల గిడ్డంగుల్లో నిల్వ చేశారు. ప్రస్తుతం ఆ పంటను విక్రయిస్తే గరిష్ఠ ధర రాక వారు నష్టపోతున్నారు. సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని, చింతలపాలెం, దొండపాడు, మేళ్లచెరువు మండలంలోని గుడిమల్కాపు రం, రఘునాథపాలెం, నల్గొండ జిల్లాలోని మిర్యాలగూడ ప్రాంతంలోని ఎనిమిది శీతల గిడ్డంగులు ఉన్నాయి. ఒక్కో దానిలో నిల్వ సామర్థ్యం 70- 90 వేలు టిక్కీలు(ఒక టిక్కీ 40కేసీలు) ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో మిర్చి పంటను అంతగా సాగు చేయరు. ఇక్కడ శీతల గిడ్డంగులు లేవు. సూర్యాపేట జిల్లాలోని మోతె మండల రైతులు ఖమ్మంలోని గోదాముల్లో నిల్వ ఉంచుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మిర్చి మార్కెట్ లేకపోవడంతో సీజన్ సమయంలో రైతులు ఖమ్మం, గుంటూరు, ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు. మిర్చికి మొదట్లో ధర లేక చాలా మంది శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచగా ప్రస్తుతం నిల్వ సరకు క్వింటా ధర రూ. 11 వేలు పలుకుతోంది. మార్కెట్ ధర ప్రకారం గరిష్ఠ ధర రూ. 19,600, కనిష్ఠ ధర 16,350 ధర ఉంది. స్థానికంగా గిడ్డంగులో మాత్రం వ్యాపారులు తక్కువ ధరకు ఖరీదు



చేస్తున్నారు. గతేడాది మిర్చి క్వింటా రూ. 30 వేలు పలికింది. వ్యాపారులు కూడా శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉన్న సరకును కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇళ్లల్లో నిల్వ ఉన్న వాటిని కొనేందుకు విముఖత చూపుతున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. ఈ సారి ఐదెకరాల్లో మిర్చి సాగు చేశాను. పంట నూర్పిడి సమయంలో ధర లేక స్థానిక శీతల గిడ్డంగిలో ఏప్రిల్‌లో నిల్వ చేశాను. ఇందుకు టిక్కీకి రూ. 160 చెల్లించాలి. ప్రస్తుతం క్వింటా ధర రూ. 11 వేలు పలుకుతోంది. పంట దిగుబడి కూడా ఎకరానికి 12 క్వింటాళ్లే వచ్చింది. వాటిని అమ్మితే పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు. శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసిన మిర్చికి మద్దతు ధర రాని విషయం మా దృష్టికి రాలేదు. సిబ్బందితో పరిశీలింపజేసి రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం.

# డిండి ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలి:సీపీఐ




**చౌటుప్పల,తెలంగాణ దిశ:**మునుగోడు, దేవరకొండ నియోజకవర్గ నియోజకవర్గాల్లోని కరువు, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించేందుకు చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగమైన డిండి ఎత్తిపోతల పథకం నిర్మాణం చేసి 3.61 లక్షల ఎకరాలకు సాగునీరూ అందించాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చౌటుప్పల్ లోని సీపీఐ కార్యాల యంలో ఆయనవిలేకరులతో మాట్లాడారు. జి.వో. 107 విడుదల చేసి 11.6.2015 తేదీన చర్లగూడెం వద్ద అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకానికి శంకుస్థాపన చేశారు అని తెలిపారు. దేవరకొండ, మునుగోడ్ నియోజకవర్గాల పరిధిలోని సుమారు 3.41 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించే విధంగా సింగరాజుపల్లి, గొట్టిముక్కల, చింతపల్లి, కిష్టిరాంపల్లి, శివన్నగూడెం రిజర్వాయర్ల నిర్మాణం జరుగు తున్నాయని కానీ, ఈ పథకానికి నేటికీ గత ప్రభుత్వం డీపీఆర్‌ను ఆమోదించలేదని తెలిపారు. పర్యావరణ అనుమతులు సైతం పొందలే దన్నారు. దీంతో ఈ ప్రాజెక్టు విషయమై ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొని ఉన్నదని తెలిపారు. పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టులో అంత ర్భాగమైన ఎదుల్లా రిజర్వాయర్ నుండి రోజుకు 0.5 టిఎంసి చొప్పున 60 రోజుల పాటు 30 టిఎంసిలు నీటిని తీసుకునే విధంగా డిపిఆర్‌ను అమోదించాలని, పర్యావరణ అనుమతులు పొందాలని ప్రభుత్వాన్ని కోరారు. డిండి ఎత్తిపోతల పథకం, ఎస్ఎల్బీసీ సొరంగం పూర్తి చేసేందుకు అవసరమైనన్ని పూర్తినిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఈటి వెంకటేష్, ఏఐటీయూసీ జాతీయ నాయకుడు ఉజ్జిని రత్నాకర్ రావు, చౌటుప్పల్ మండల కార్యదర్శి పల్లె శేఖర్ రెడ్డి, పురపాలిక కమిటీ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, నాయకులు రామలింగం, రహమాన్ , సుధాకర్, నరసింహ, మంకులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి.. పరిష్కారం అంతంతే..!

**ములుగు,తెలంగాణ దిశ:**సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే ప్రజావాణి కార్యక్ర మం నామమాత్రంగా కొనసాగుతుంది. వ్యయప్రయాసలకోర్చి మూరుమూల గ్రామాల నుంచి వచ్చి జిల్లా పాలనాధికారి కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో దరఖాస్తులు అందిస్తున్నారు. స్వయంగా కలెక్టర్‌కు విన్నవిం చినా.. ఫలితం ఉండటం లేదని పలువురు అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్య పరిష్కారం కాకపోతుందా అని కలెక్టర్ కార్యా లయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వృద్ధుల నుంచి దివ్యాంగుల వరకు ఎంతో మంది వస్తున్నా.. అధికారుల పట్టింపులేమితో పరిష్కారం కావడం లేదంటున్నారు. జూన్, జులై నెలల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 211 వినతులు స్వీకరించారు. ఇందులో సుమారు 40 శాతం వరకు పరిష్కారం కాలేదని పలువురు చెబుతున్నారు. ఇటీవలి కాలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ దివాకర ప్రజావాణి కార్యక్రమంలో పలు మార్పులు చేశారు. ప్రతి సోమవారం పలు శాఖల అధికారులు హాజరయ్యేలా చూస్తున్నారు. వచ్చిన వినతులను అప్పటికప్పుడు సంబంధిత అధికారులకు సూచిస్తున్నారు. ఇలా చేయడంతో ఎన్ని దరఖాస్తులు వచ్చాయనే అంచనాతో పాటు త్వరగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకునే అవకాశం ఉందని వివిధ శాఖల అధికారులు చెబుతున్నారు. దివాకర, కలెక్టర్, ములుగు : ప్రజావాణి కార్యక్రమంలో ప్రతి అర్జీని పరిశీలిస్తున్నాం. వాటి పరిష్కారానికి ప్రతి సోమవారం వినతుల



స్వీకరణ అనంతరం సంబంధిత అధికారులతో సమీక్షిస్తూ.. ఎలాంటి జాప్యం జరగకుండా సరైన వివరణ అర్జీదారుడికి చేరేలా చర్యలు తీసుకుం టున్నాం. ఎక్కువగా భూ, నిరుద్యోగ, పింఛన్ల సమస్యలపై వినతులు వస్తున్నాయి. వినతిని పరిశీలించి దాని పరిష్కారానికి సంబంధించిన వివరాలను అర్జీదారుడి తెలియజేస్తున్నాం. వినతులు సమర్పించడానికి వచ్చిన అర్జీదారులకు కలెక్టర్ కార్యాలయంలో మౌలిక వసతులు కరవయ్యా యి. తాగేందుకు నీరు లేక బయట కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. అదేవిధంగా శౌచాలయాలు అపరిశుభ్రంగా ఉండి కంపు కొడుతున్నాయి. కనీస వసతులు కల్పించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

# వాన జోరు.. రైతన్న హుషారు..!

**మానుకోట,తెలంగాణ దిశ:**ఇటీవల కురిసిన భారీ వర్షాలు జిల్లాలోని వర్షపాతాన్ని గణనీ యంగా పెంచాయి. జిల్లాలోని పలు నీటి వనరులు నిండు కుండల్లా మారాయి. వానాకాలం సాగుకు జీవం పోశాయి. పంటల విస్తీర్ణం పెరిగేందుకు తోడ్పడ్డాయి. రెండు నెలలుగా ముసురులతో మురిపిస్తూ జిల్లా వర్షపాతం సాధారణంగానే ఉండగా ఇటీవల కురిసిన వర్షాలతో వర్షపాతం గణనీయంగా పెరిగి జిల్లా ఎక్కువ స్థాయి వర్షపాతంగా నమోదైంది. వారం రోజుల కిందట జిల్లాలో 12 మండలాల్లో సాధారణ వర్షపాతంగానే నమోదు కాగా ఇప్పుడు ఆ సంఖ్య ఏడుకు తగ్గింది. ఐదు మండలాల్లోనే ఎక్కువ వర్షపాతం ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య పది మండలాలుగా ఉంది. తాజాగా జిల్లాలో మరిపెడ మండలం అత్యధిక వర్షపాతంగా నమోదైంది. జూన్ ఒకటి నుంచి ఈ నెల 8వరకు జిల్లా సాధారణ వర్షపాతం 454.0 మి.మీ., ఉండగా 567.2 మి. మీగా నమో దైంది. ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో అన్ని పంటల మొత్తం విస్తీర్ణం 4,31,591 ఎకరాలుగా అంచనా వేయగా ఉండగా తాజా పంటల నమోదు ప్రకారం 1,94,315 ఎకరాల వరకు ఉంది. ప్రస్తుత వర్షాలతో వరి నాట్ల ప్రక్రియ వేగం అందుకుని విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయాధికారి కె.అభిమన్యుడు తెలిపారు. జిల్లాలో వరి వానాకాలం అంచనా మిరపకు సంబంధించి ప్రస్తుతం జిల్లాలోని రైతులు సిద్ధం చేస్తున్న నారుమడి 40 రోజుల వయసులో ఉందని.. ఈ నెల మూడో వారం నుంచి మిరప నాట్లు ప్రారంభం కానున్నాయని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మరియన్న తెలిపారు.

# గోస వింటున్నారు.. పరిష్కారమే చూపరు!

**వరంగల్,తెలంగాణ దిశ:**ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరుగుతున్న ప్రజావాణి కార్యక్రమ లక్ష్యం నీరుగారుతోంది. సమస్యల పరిష్కారం కోసం పదుల సార్లు కలెక్టరేట్ మెట్లు ఎక్కాల్సి వస్తోందని అర్జీదారులు నిట్టూరుస్తున్నారు. ఇప్పటివరకు పరిష్కారానికి నోచుకోని 662 పెండింగ్ దరఖాస్తులు అధికారుల పనితనానికి నిదర్శనం. ప్రజావాణి అర్జీలపై పూర్తిస్థాయిలో సమీక్షలు జరగకపోవడంతో.. వాటి పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారు. దరఖాస్తులను వారంలోపే పరిష్కరించాలని కలెక్టర్ సూచిస్తున్నా.. క్షేత్రస్థాయిలో పట్టించుకున్న దాఖలాలు లేవు. అర్జీలు ఏ దశలో ఉన్నాయో కూడా అర్జీదారులకు సమాచారం అందడంలేదు. సరైన పరిశీలనా వ్యవస్థ లేకపోవడంతో పరిష్కారాల్లో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. దూర ప్రాంతాల నుంచి ప్రజావాణికి వచ్చే అర్జీదారులకు కలెక్టరేట్ ప్రాంగణంలో సరిపడా కుర్చీల్లేక అవస్థలు పడుతున్నారు. ప్రతి సోమవారం వందల సంఖ్యలో హాజరవుతుంటారు. ఒక్కో సందర్భంలో కలెక్టర్‌ను కలిసేందుకు ఆలస్యమవుతుంది. అంతసమయం నిలబడలేక వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ప్రజావాణి రోజైనా.. కూర్చునేందుకు వెసులుబాటు కల్పించాలని అర్జీదారులు కోరుతున్నారు. ప్రజావాణిలో నేరుగా కలెక్టర్‌ను కలిసి సమస్యలను చెప్పుకుందామనుకుంటే.. ముందుగా ఆపరేటర్ వద్ద సమస్య వివరాలను నమోదు చేసుకోవాలనే నిబంధనతో అర్జీదారులకు తిప్పలు తప్పట్లేదు. ఒక్కో దరఖాస్తు నమోదుకు 10 నుంచి 15 నిమిషాల సమయం పడుతుండడంతో దూరప్రాంతాల నుంచి వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో సమస్యల నమోదు ఆలస్యం కారణంగా నిర్దేశిత సమ



యంలో కలెక్టర్‌ను కలవకుండానే నిరాశతో వెనుదిరుగుతున్నారు. గతంలో మాదిరి కలెక్టర్‌కు సమస్య చెప్పుకున్న తర్వాతే ఆపరేటర్లు వివరాలు నమోదు చేసుకుని రసీదు ఇచ్చేవిధంగా ప్రజావాణిలో మార్పులు చేయాలని అర్జీదారులు కోరుతున్నారు. మచ్చ నర్సింహరా ములు, తిరుమలాయపల్లి 1970లో అప్పటి ప్రభుత్వం సర్వేనంబరు 7/7లో నాకు ఎకరం భూమి ఇచ్చింది. పట్టా పాసు పుస్తకం ఉంది. తెలంగాణఏర్పాటు తర్వాత ప్రభుత్వం పాతవి రద్దుచేసి కొత్తవి జారీ చేసింది. కానీ నా భూమికి సంబంధించి రాలేదు. కొత్త పట్టా పాసుపు స్తకం కోసం8ఏళ్ల నుంచి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా.. నేను సర్పంచిగా పనిచేసిన రెండు పర్యాయాలు ఎంతో మంది రైతులకు ఇప్పించాను. పెండింగ్ అర్జీలపై ప్రతి సోమవారం కలెక్టర్ సమీక్షిస్తు న్నారు.శాఖల వారీగా వివరాలు తెలుసుకుని.. సకాలంలో పరి ష్కరిం చాలని అధికారులను ఆదేశిస్తున్నారు. అర్జీదారులకు అదనంగా కుర్చీల ఏర్పాటుకు సంబంధించి కలెక్టర్ దృష్టికి తీసుకెళతాం.

# కాలం చెల్లినా రోడ్డెక్కుతున్నాయ్..



**జనగామ,తెలంగాణ దిశ:**కాల పరిమితి తీరిన వాహనాలు జిల్లా వ్యాప్తంగా పెరిగిపోతున్నాయి.. అయినప్పటికీ సదరు వాహనాల యజమానులు రవాణా శాఖ నిబంధనలను పాటించకుండా రోడ్లపై తిప్పుతుండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అంతేకాకుండా వాయు కాలుష్యం పెరిగి, అనారోగ్యం బారిన పడుతున్నారు. కాలపరిమితి పెంచుకునేందుకు ఫీజులు కట్టకపోవ డంతో జిల్లా రవాణా శాఖకు భారీ గండి పడుతోంది. జిల్లా వ్యాప్తంగా కార్లు, బైక్‌లు, ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, జీపులు, కంప్రెషర్ వాహనాలు, ఆటోలు తదితర వాహనాలు కాలపరిమితి తీరినవి రవాణా శాఖ లెక్కల ప్రకారం జిల్లాలో 4804 ఉన్నాయి. రీవాల్యుడిటీ పేరిట పెండింగ్‌లో ఉన్న వాహనాలకు సంబంధించి జిల్లా రవాణా శాఖకు రూ. 1.70 కోట్లు ఛార్జీల రూపంలో రావాల్సి ఉంది. కార్లకు సంబంధించి 15 ఏళ్లు దాటిన తర్వాత మరో ఐదేళ్లు కాలపరిమితి పొడగించుకోవడానికి ఒక్కో కారుకు గ్రీన్ ట్యాక్స్ రూ. 5వేలు, రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 5435 మొత్తం రూ. 10 వేల పైనే అవుతుంది. ద్విచక్ర వాహనాలకు గ్రీన్ ట్యాక్స్ రూ. 1000, ఫీజు రూ. 2435 మొత్తం 3435 ఖర్చు చేయాల్సి ఉంటోంది. 15 సంవత్సరాలు దాటిన వాహనాలు రోడ్లపై తిరుగుతూ రీవాల్యుడిటీ చేసుకోవడానికి జాప్యం చేస్తే నెల నెలా జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోకపోవడంతో అటు ప్రమాదకర ప్రయాణాలతో పాటు సదరు వాహనాలు వెదజల్లే కాలుష్యంతో పర్యావ రణానికి హాని కలిగిస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో 15 ఏళ్లు దాటిన వాటికి గడువు పొడిగింపే లేదు, అవి తుక్కు కింద విక్రయిస్తారు. ఇక్కడ కాలపరిమితి పెంచుకునే అవకాశం కల్పించినా శ్రద్ధ చూపకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శ్రీనివాస్‌గౌడ్, జిల్లా రవాణా శాఖ అధికారి: 15 ఏళ్లు కాలపరిమితి తీరిన వాహనాలు రోడ్డు ఎక్కి తిరుగుతుంటే తనిఖీలో పట్టుబడితే భారీ జరిమానాలు విధిస్తున్నాం.

తమకు ఉన్న అవకాశాలను వాహనదారులు వినియోగించుకోవాలి. సురక్షిత ప్రయాణానికి గాను వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవడంతో పాటు రీవాల్యుడిటీ పెంచుకోవాలి. అన్ని రకాల అనుమతి పత్రాలు కలిగి ఉండి రవాణా శాఖకు సహకరించాలి.

# ఉప్పొంగిన వాగులు నిలిచిన రాకపోకలు

**చింతలమానేపల్లి,తెలంగాణ దిశ:**మండలంలో కురిసిన భారీ వర్షానికి దిందా-కేతిని, శివపెల్లి వాగులు ఉప్పొంగి రాకపోకలు నిలిచిపోయాయి. ఉదయం కేతిని రైతులు దిందా శివారులోకి, దిందా రైతులు కేతిని శివారులోకి వ్యవసాయ పనులకు వెళ్లారు. సాయంత్రం తిరిగి తమ గ్రామాలకు వస్తున్న క్రమంలో వాగులు ఉప్పొంగాయి. దీంతో వాటిని దాటలేక ఎక్కడి కూలీలు.. రైతులు అక్కడే గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఇక కొందరు శివపల్లి గ్రామస్తులు గూడెంలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటున్న తమ పిల్లలను చూసి తిరిగి వస్తుండగా, శివపల్లి వాగు ఉధృతంగా ప్రవహించడంతో అక్కడే ఆగిపోయారు. రాత్రి దిందా-కేతిని వాగుల ఉధృతి తగ్గగా, స్థానిక నాయకులు ట్రాక్టర్ల ద్వారా ఆయా గ్రామాల రైతులను దాటించారు. ఇక గూడెం వెళ్లిన శివపల్లి గ్రామస్తులు, గూడెంలోనే ఉన్నట్లు తెలిసింది. మండలంలోని వంజీరి రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యను పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారంవంజీరి రైల్వే అండర్ బ్రిడ్జినిపరిశీలించిన అనంతరం అధికా రులు, విలేకరులతో మాట్లాడారు. భారీ వర్షాలతో రెండు



నెలలుగా వంజీరి రైల్వే అండర్ బ్రిడ్జి కింద బురదమయమైందని, ప్రజలు, విద్యా ర్థులు,ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నా ఎమ్మెల్యే, అధికా రులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గం కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, నాయకులు రాజ్‌కుమార్, ఓదె లు, సలీం. రాజు, రావూజీ పాల్గొన్నారు.

# సమస్యల వలయంలో గురుకులం!



**మంచిర్యాల,తెలంగాణ దిశ:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గురుకులాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతు న్నాయి. అద్దె, శిథిలమైన భవనాల్లో అరకొర వసతుల నడుమ కొనసాగుతుండగా, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టకపోవడంతో విద్యార్థులు అర్ధాకలితో అలమటించాల్సి వస్తున్నది. అనేకచోట్ల పిల్లల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోవడంతో అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి నెలకొన్నది. ఇక కరెంట్ పోతే కటిక చీకట్లో భయం భయంగాగడపాల్సి వస్తున్నది. రాత్రీ సమయంలో విష పురుగులు సంచరి స్తుండడంతో బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. తాండూర్ మండలం లోని జ్యోతిబాపులే పాఠశాల అద్దె భవనంలో 421 మంది విద్యార్థులతో కొనసాగుతున్నది. కనీస సౌకర్యాలు లేని కారణంగా తాండూరుకు మంజూరైన ఇంటర్ కళాశాలను చెన్నూర్‌కు తరలించారు. %శ్రీ% చెన్నూర్‌లో గురుకుల సంక్షేమ పాఠశాలలో డైనింగ్ హాల్ లేక విద్యార్థులు ఆరుబయట కింద కూర్చొని భోజనం చేస్తున్నారు. %శ్రీ% లక్షెట్టిపేట బాలికల గురుకులంలో మినరల్ వాటర్ ప్లాంట్ పని చేయకపోవడంతో విద్యార్థులకు శుద్ధజలం అందడం లేదు. లక్షెట్టిపేట మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు. శనివారం భోజనంలో గుడ్డు పెట్టలేదు. బెల్లంపల్లి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం వడ్డించాల్సి ఉండగా, అన్నం, కారంతో భోజనం పెట్టారు. బెల్లంపల్లి జ్యోతిబాఫూలే బాలికల గురుకుల విద్యాలయంలో 550 మంది విద్యార్థులుండగా, 10 మరుగుదొడ్లు మాత్రమే ఉండడంతో విద్యార్థులు పాట్లు పడుతున్నారు. అద్దెభవనంలో అరకొర వసతు ల మధ్య చదువులు కొనసాగించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. రాత్రి సమయంలో విష పురుగులతో ప్రమాదం పొంచి ఉందని పిల్లలు చెబుతున్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని గిరిజన ఆశ్రమోన్నత పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. 30 ఏళ్ల క్రితం నిర్మించగా, ఎప్పుడు ఏం జరుగుతుందోనని విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. సరైన సౌకర్యాలు లేక తిప్పలు పడుతున్నారు. కిటికీలకు తలుపలు లేకపోవడంతో.. వాటికి ప్లాస్టిక్ సంచులు కట్టారు. వర్షం వచ్చినప్పుడు గదుల్లోకి నీరు చేరుతున్నది. పూర్తి స్థాయి డైనింగ్ టేబుళ్లు లేకపోవడంతో విద్యార్థులు కింద కూర్చోని భోజనం చేయాల్సి వస్తున్నది. నెలల తరబడి బిల్లులు రావడం లేదనే సాకుతో కాంట్రాక్టర్లు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదు.్(టీ) మండలకేంద్రం లో మూడు గురుకులాలు (సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల, గురుకుల బాలుర పాఠశాల/కళాశాల, కాగజ్‌నగర్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాల) ఉన్నాయి. కాగజ్‌నగర్ గురుకుల బాలికల పాఠశాలలో కోతుల బెడద తీవ్రంగా ఉ ంది. సిర్పూర్(టీ) బాలుర గురుకుల భవనం 30 ఏళ్ల క్రితం నిర్మించగా, శిథిలమయ్యింది. డైనింగ్‌హాల్ శిథిలావస్థలో ఉంది. మరమ్మతులు చేపట్టాలి. మండల కేంద్రంలోని కస్తూర్బా గు రుకుల విద్యాలయం ఆవరణ పిచ్చి మొక్కలతో నిండి అపరిశుభ్రంగా మారింది. పొదల నుంచి విష పురుగులు వచ్చే అవకాశముండడంతో విద్యార్థులు భయపడుతున్నారు. వంటశాల గది కిటికీలు పగిలిపోయి శిథిలావస్థలో ఉంది. రెబ్బెన మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో వాచ్‌మెన్ పోస్టు, గంగాపూ ర్‌శివారులోని కేజీబీవీ మూడు పోస్టులు, గోలేటి ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలలో ఎస్జీటీ పోస్ట్ ఖాళీగా ఉంది.

# ఇంటి వద్దే రేషన్




నెల్లూరు :రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అన్ని వ్యవస్థల్లో మార్పులు చకచక చేస్తున్నారు. ఇక నుంచి ఇంటి వద్దే రేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే రేషన్ డీలర్ల కమిషన్ పెంచేందుకు కూడా సమీక్షలు చేస్తున్నారు. దీంతో పాత పద్దతినే అమలు చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది.తొలుత రాష్ట్రంలో రేషన్ షాప్‌ల వద్ద రేషన్ ఇచ్చేవారు. రేషన్ డీలర్లు కమిషన్ ప్రాతిపదికన దుకాణాలను నిర్వహించేవారు. 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇంటింటికీ రేషన్ వ్యవస్థ తీసుకొచ్చారు. రేషన్ డీలర్లకు లబ్దిదారులకు మధ్య మొబైల్ డెలివరీ యూనిట్లను నెలకొల్పారు. రేషన్ డీలర్ల నుంచి బియ్యాన్ని మొబైల్ డెలివరి యూనిట్లలో తరలించి కార్డు దారులకు పంపిణీ చేసేవారు.2021 జనవరి 1 నుంచి గ్రామాల్లోనూ, ఫిబ్రవరి 1నుంచి పట్టణాల్లో ఇంటింటికి రేషన్ పంపిణీ చేసేందుకు వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. సిఎం జగన్మోహన్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారు.రేషన్ పంపిణీ కోసం మొబైల్ వాహనాలను కూడా కొనుగోలు చేసింది. శ్రీకాకుళం జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఏడాదిగా అమలు చేసి అనంతరం 2021లో రాష్ట్ర వ్యాప్తంగా దీన్ని అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించింది.అప్పుడే స్థానిక సంస్థల ఎన్నికల రావడంతో అప్పటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్‌ఈసీ) నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఈ పథకాన్ని నిలిపివేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్‌కు లేఖ రాశారు. దీనిపై ప్రభుత్వం సవివరంగా ఎస్‌ఈసీకి తిరిగి సమాధానం రాసింది.పేదలకు ఆహార భద్రత కల్పించడం ప్రభుత్వ విధి అని, ఇందులో భాగంగానే అర్హత కలిగిన పేదలందరికీ వారి ఇళ్ల వద్దే నాణ్యమైన బియ్యం అందజేసేందుకు ముందుకు అడుగులు వేస్తున్నామని ప్రభుత్వం ఆ లేఖలో పేర్కొంది. దీన్ని అనుమతించాలని కోరింది. అలాగే హైకోర్టు అప్పుడు రాష్ట్రప్రభుత్వం హౌస్ మోషన్ పిటిషన్ దాఖలుచేశారు. హైకోర్టు రాజకీయ నాయకులు ఫోటోలు పెట్టకుండా అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఇంటింటికీ రేషన్ పథకం అమలులోకి వచ్చింది.ఇంటింటికీ సరుకులు పంపిణీ చేయడానికి రూ.538 కోట్లతో 9,260మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్‌వాహనాలను కొనుగోలు చేసింది. ఒక్కో వాహనం రూ.5,81,190 ధర పడింది.ఒక్కో వాహనానికి డ్రైవర్ కమ్ సప్లైదారుడు ఒకరు, సహాయకుడు మరొకరు ఉంటారు. నిర్ణీత సమయంలో ఇళ్ల వద్దకేవాహనం వెళ్లి రేషన్ సరఫరా చేస్తున్నారు. అయితే నెట్‌వర్క్ సమస్య వల్ల ప్రతి ఇంటికి వాహనం వెళ్లటం లేదు. ఒకదగ్గర వాహనాన్ని ఆపి ఆప్రాంతంలోని పది ఇళ్లకు రేషన్ఇస్తున్నారు. ఆ తరువాత మరొక ప్రాంతంలో ఆపి అక్కడ చుట్టుపక్కల ఉన్న ఇళ్లకు రేషన్ ఇస్తారు.ఇటీవలి జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం మారింది. దీంతో గతంలోనే టీడీపీ నేతలు తాము అధికారంలోకి రాగానే రేషన్ షాపుల వద్దే రేషన్ ఇచ్చే పాత వ్యవస్థను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగానే ఇంటింటికీ రేషన్ పథకాన్ని రద్దు చేసి, పాత రేషన్ షాపుల వ్యవస్థే రానుంది. అందుకోసం ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. అలాగే రేషన్ డీలర్ల కమిషన్ కూడా పెంచేందుకు ప్రభుత్వం సమీక్షిస్తుంది. రేషన్ దుకాణాలు, మొబైల్ డెలివరీ యూనిట్లతో బియ్యం మాత్రమే ప్రస్తుతం పంపిణీ చేస్తున్నారు.ఏపీలో ప్రస్తుతం 2రుపాయలకు సరఫరా చేస్తోన్న బియ్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసి పేదలకు పంపిణీ చేయడానికి ప్రభుత్వం కిలోకు రూ.39 ఖర్చు చేస్తోంది.

# గెలిచినా గుర్తింపు ఏదీ..?

హైదరాబాద,తెలంగాణ దిశ:పార్టీ అధికారంలో లేకపోవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పరిస్థితి గమ్మత్తుగా మారింది. పేరుకే ఎమ్మెల్యే కానీ ప్రజలకు, కార్యకర్తలకు ఏ పని చేసి పెట్టలేని పరిస్థితుల్లో ఉన్నారట కారు పార్టీ ఎమ్మెల్యేలు. తమ నియోజకవర్గాల్లో..హస్తం పార్టీ నేతల హవా కొనసాగుతుండటాన్ని తట్టుకోలేకపోతున్నారట. అధికార యంత్రాంగం హస్తం పార్టీ నేతలకే ప్రయారిటీ ఇస్తుండటంపై కూడా మండిపడుతున్నారు.కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అయితే తమ హక్కుల కోసం న్యాయపోరాటం చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్, కోరుట్ల, కరీంనగర్, సిరిసిల్ల నియెజకవర్గాల్లో బీఆర్ఎస్ నేతలు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. అయితే ఈ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల కంటే..ఓడిన కాంగ్రెస్ నేతల హవాను ఎక్కువ నడుస్తుందట.అధికారం చేతులు మారితే ఎలా ఉంటుందనేది ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాలే ఓ ఉదాహరణగా కనిపిస్తోంది. దశాబ్దకాలం పాటు అధికారంలో ఉన్నప్పుడు సిరిసిల్లలో కేటీఆర్ హవా కొనసాగింది. కానీ ఇప్పుడు సిరిసిల్లలో సీన్ మారిపోయిందట. కేటీఆర్ కనుసన్నల్లోనే నడిచిన సిరిసిల్ల రాజకీయాలను..కాంగ్రెస్ నేత కేకే మహేందర్ రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ తమ గుప్పిట్లో పెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారట.కేటీఆర్‌కు ప్రాధాన్యత లేకుండా చేసేందుకు నేతన్నలతో పాటుగా..కేటీఆర్ ఫాలోవర్స్‌ను తమ వైపు తిప్పుకునేందుకు ప్లాన్ చేస్తున్నారట. ఇక కరీంనగర్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ లేకుండానే రివ్యూలు జరుగుతుండటం చర్చనీయాంశంగా మారింది. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రోటోకాల్ పాటించడం లేదంటూ బీఆర్ఎస్ శ్రేణులు గరమ్ అవుతున్నాయి.ఇక హుజురాబాద్, కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్ కుమార్ మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలిచారు. నియోజకవర్గంలో తమకంటూ ఓ గుర్తింపు తెచ్చుకోవాలని తాపత్రయపడుతున్న ఈ ఇద్దరు శాసనసభ్యులకు..కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్‌లు బ్రేకులు వేస్తున్నారట.హుజురాబాద్ నియెజకవర్గంలో కౌశిక్ రెడ్డిపై పోటీ చేసి ఓడిన కాంగ్రెస్ నేత ప్రణవ్ బాబు నియోజకవర్గ రాజకీయాలను తన గుప్పిట్లో పెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారట. అధికార యంత్రాంగం కూడా ప్రణవ్ బాబు చెప్పిన పనులను వెంటనే చేస్తూ..ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆదేశాలను పట్టించుకోవడం లేదట. దీంతో తన మాట వినని అధికారులపై ఆగ్రహంతో ఊగిపోతున్నారట ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి.ఇటీవల కళ్యాణ లక్ష్మి చెక్కుల వ్యవహారంలో తన హక్కులకు భంగం కలిగిస్తున్నారంటూ కోర్టును ఆశ్రయించారు. ప్రోటోకాల్ పాటించకపోతే ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తానంటూ ఎమ్మెల్యే కౌశిక్ హెచ్చరిస్తున్నా ఫలితం లేకుండా పోతుందట.ఇక కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కుమారా..? లేక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ రావా.. అన్నట్లుగా ఉందట పరిస్థితి. ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్ కంటే..పోటీ చేసి ఓడిన నర్సింగరావు హవానే కొనసాగుతుండటంతో బీఆర్ఎస్ క్యాడర్, లీడర్లకు ఏ మాత్రం మింగుడు పడటం లేదట. ఈ నియోజకవర్గాల్లో అటు ఎమ్మెల్యేలు, ఇటు హస్తం నేతల మధ్య అధికారులు నలిగిపోతున్నారట.కొందరు అధికారులు ఓవరాక్షన్ చేస్తుండటంతో భవిష్యత్‌లో వచ్చేది తమ ప్రభుత్వమేనంటూ హెచ్చరిస్తున్నారట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు. పవర్ చేతులు మారితే..సీన్ ఎలా మారిపోతుందో కాంగ్రెస్ నేతల హవా చూస్తేనే అర్థమవుతుందన్న చర్చ జరుగుతోంది.

# ఏటా మాటలు.. ఇవ్వరే మూటలు?



అమరావతి,తెలంగాణ దిశ: నాగార్జునసాగర్ కుడి కాలువ పరిధిలో గత ఐదేళ్లుగా నిధుల కొరతతో కాలువల మరమ్మతులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. నీటితీరువా వసూలు కాకపోవడం, ప్రభు త్వం నుంచి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో నిధుల కొరత వెంటాడుతోంది. ఏటా క్షేత్రస్థాయి నుంచి ప్రతిపాదనలు పంపడం.. నిధుల కొరతతో ఉన్నతాధికారులు మంజూరు చేయకపోవడంతో కా లువలు అధ్వానంగా తయారయ్యాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈసారి కూడా కాలువ మరమ్మతుపై నీలినీడలు కమ్ముకున్నాయి. గ ుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో 8.48 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉంది. నిధుల కొరతతో ఇప్పటికీ కాలువల మరమ్మతుపై స్పష్టత లేకపోవడంతో జలవనరులశాఖ అధికా రులు ప్రతిపాదనలు సిద్ధం చేసినా పనులు జరిగే పరిస్థితులు కనిపించ దం లేదు. గతేడాది కాలువలకు సాగునీరు విడుదల చేయకపోవడంతో కాల్వకట్టలు అధ్వానంగా ఉండడంతోపాటు పిచ్చిమొక్కలు పెరిగి నీటిప్రవాహానికి అడ్డంకిగా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కనీస మరమ్మతు చేయకపోతే ఈఏడాది కూడా సాగునీటి కష్టాలు తప్పవని సాగుదారులు

# విశాఖ పోర్టుకు వచ్చిన ఆ కంటెయినర్ కథ కంచికేనా..?



విశాఖపట్నం,తెలంగాణ దిశ: విశాఖ పోర్టుకు రెండు నెలల క్రితం ఓ కంటెయినర్‌లో డ్రైడ్ ఈస్ట్ మాటున డ్రగ్స్ దిగుమతి కావడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఇంటర్‌పోల్ సమాచారంతో దిల్లీ నుంచి రంగంలోకి దిగిన సీబీఐ బృందం డ్రైడ్ ఈస్ట్ మాటున నిషేధిత మాదక ద్రవ్యాలున్నట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చింది. న్యాయమూర్తి సమక్షంలో 25వేల కిలోల డ్రైడ్ ఈస్ట్ బ్యాగ్‌ల నుంచి అధికారులు నమూనాలు సేకరిం చారు. కిలో ఈస్ట్‌లో ఎంత పరిమాణంలో మాదక ద్రవ్యాలు న్నాయో లెక్క తేల్చేందుకు సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (సీఎఫ్ఎస్ఎల్)కి నమూనాలు పంపారు. మూడు ప్రయోగశాలలకు పంపిన నమూనాల నివేదికలుమూడువారాల్లో వస్తాయని చెప్పి నెలలు గడుస్తున్నా ఇంతవర కూ అందలేదు. సంధ్యాఆక్వా ఎక్స్‌పోర్ట్స్‌తో పాటు, పలువురు గుర్తుతెలి యని వ్యక్తులపై అప్పట్లో సీబీఐ కేసు నమోదు చేసినా ఇప్పటి వరకూ చర్యల్లేకపోవడం చర్చనీయాంశమైంది. ఈ ఏడాది విశాఖ పోర్టుకుకంటె యినర్ రాగా...19న49 నమూనాలు పరీక్షించిడ్రగ్స్ ఉన్నట్లు తేల్చారు. సంధ్యా ఆక్వాపై కేసు నమోదు చేశాక సీబీఐ బృందాలుగా ఏర్పడి బ్రెజిల్‌కువెళ్లినట్లు తెలుస్తోంది. అదే సమయంలో మరో బృందం సంధ్యా ఎక్స్‌పోర్ట్స్‌కు సంబంధించిన కాకినాడ జిల్లా మూలపేట, వజ్రకూటం లోని పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో కంపెనీ బస్సులోరికార్డులు,చెక్‌బుక్‌లు, ఓచర్లు తరలిస్తుండగా బ్రేక్‌డౌన్ అయిం ది. స్థానిక పోలీసులు వాటిని సీబీఐకి అప్పగించకుండా.. యాజమాన్యా నికిఇవ్వడంఅప్పట్లో అనుమానాలకు దారితీసింది.మరోవైపు కంటెయిన ర్‌ను అన్నివాతావరణాలు తట్టుకునేప్రదేశంలో ఉంచాలని సీబీఐ నిర్ణయి ంచింది. కానీ, ఇప్పటికీ విశాఖ కంటెయినర్ టెర్మినల్ ప్రైవేటు లిమిటెడ్ (వీటీసీపీఎల్) ఎగ్జామిన్ పాయింట్‌లోనే దాన్ని ఉంచారు.

# అటకెక్కిన అభివృద్ధి...!



పంగల్,తెలంగాణ దిశ:పంగల్‌రోడ్డు నుంచి బళ్లారిరోడ్డు వరకు రహదారి విస్తరణ పూర్తయి ఆరు నెలలు దాటుతున్నా అనుబంధంగా చేయాల్సిన అభివృద్ధి పనులు ముందుకు సాగటంలేదు. ఈ రహదారి విస్తరణలో భాగంగా నడిమివంక సమీపంలో ఖాళీ ప్రదేశంలో చిన్నపాటి ఉద్యానవనం ఏర్పాటుకు సన్నాహాలు జరిగాయి. అవి పనులు ప్రారంభ దశలోనే ఆగిపోయాయి. ఇక్కడ ఆహ్లాదం కోసం ఉద్యానవనం ఏర్పాటు చేసి గతంలో ఈ రహదారి వెంట ఉండే పలు ప్రముఖుల విగ్రహాలను ఇక్కడ మరలా పెట్టేందుకు ప్రణాళికలు ఉన్నాయి. అవి కూడా ఏమాత్రం ముందుకు కదలకుండా రెండు విగ్రహాలను ఇక్కడ పెట్టి వదిలేశారు. ప్రస్తుతం అభివృద్ధి పనులేవీ ముందుకు సాగక ఈ ప్రాంతమంతా మట్టికుప్పలతో నిండి ఉంది. అక్కడ ప్రహరీని ఆనుకుని కొందరు రహదారి పక్కనే వ్యాపారాలు చేసుకుంటున్నారు. వీరికోసం షాపుల నిర్మాణం చేయాలని వినతులు ఉన్నాయి. అటు ఉద్యానవనం పూర్తికాక ఇటు దుకాణ సముదాయం పూర్తి కాకుండా వృథాగా మారుతోంది. జాతీయ రహదారుల ఏఈఈ ధనలక్ష్మిని సంప్రదించగా రహదారి నిర్మాణం అనంతరం సుందరీకరణ పనులు తమ పరిధిలో ఉండవని మున్సిపల్ అధికారులు వాటికి సంబంధించిన పనులు చేస్తారని తెలిపారు. మున్సిపల్ ఈఈ సూర్యనారాయణకు సంప్రదించగా..ఇంకా రహదారి నిర్మాణ పనులు పూర్తి కాలేదని, తమకు నిర్వహణ బాధ్యతలు అప్పగించలేదని తెలిపారు.

# అవస్థల్లో అంగన్‌వాడీలు?




కరీంనగర్,తెలంగాణ దిశ: అంగన్‌వాడీల నిర్వహణ భారంగా మారింది. నెలల తరబడి నిధులు విడుదల కాకపోవడంతో సిబ్బంది వెతలు అంత ఇంత కాదు. చిన్నపాటి ఉద్యోగం చేసే వాళ్లకు చేతినుంచి డబ్బులు పెట్టడం ప్రహస నంగా మారింది. కేంద్రాలకు నెలల తరబడి అద్దెలు చెల్లించకపోవడంతో యజమానుల నుంచి తీవ్ర ఒత్తిడి పెరిగింది. వేతనాల నుంచి చెల్లిద్దామ నుకున్న నెలల తరబడి వేతనాలు సైతం రాక అంగన్‌వాడీ టీచర్ల అవస్థలు అంత ఇంత కాదు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు మొర పెట్టుకున్నా ప్రయోజనం ఉండటం లేదు. రాష్ట్ర స్థాయిలో నిధులు విడుదల అయితేనే సమస్య పరిష్కారం అవుతుందని, అప్పటి వరకు మేం చేసేదేమీ లేదని జిల్లా స్థాయి అధికారులు సెలవిస్తున్నారు. నాలుగింట ఒకవంతు కేంద్రాల్లో అంగన్‌వాడీ సిబ్బంది ఖాళీలున్నాయి. సిబ్బంది భర్తీ ప్రక్రియ చేపడుతామని అంటున్నా.. ఇప్పటి వరకు కనీసం విధివిధానాలు సైతం విడుదల కాలేదు. భర్తీకి మరింత సమయం పట్టే అవకాశాలు కని పిస్తున్నాయి. వేసవి సెలవుల అనంతరం కొంగొత్త ఉత్సాహంతో ప్రారంభం కావాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు.. సిబ్బంది ఖాళీలు, నిధుల లేమితో నిర్వహణ భారమై.. మంచి రోజుల కోసం ఎదురుచూస్తున్నాయి. తక్షణమే నిధులు విడుదల చేయాలని జిల్లా అంగన్‌వాడీ సిబ్బంది ముక్తకంఠంతో కోరుతున్నారు. జిల్లాలో కరీంనగర్ అర్బన్, కరీంనగర్ రూరల్, హుజూరాబా ద్, గంగాధర నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో 777 అంగన్‌వా డీ కేంద్రాలున్నాయి. ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు 25 వేల మంది ఉన్నారు. కేంద్రాలకు వచ్చే మూడు నుంచి ఆరేళ్ల లోపు వారు ఏడు వేల మంది ఉన్నారు. గర్భిణులు, బాలింతలు కలి పి ఎనిమిది వేల మంది ఉంటారు.

# బూడిద చుట్టూ రాజకీయ చిచ్చు!



పెద్దపల్లి,తెలంగాణ దిశ:బూడిద రవాణా వ్యవహారం రాజకీయ దుమారం లేపుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల పరస్పర విమర్శలకు కేంద్రంగా మారింది. రామగుండం ఎన్టీపీసీ పరిశ్రమ నుంచి వెలువడే బూడిద రవాణాకు సంబంధించి కాంగ్రెస్, భారాస నేతల మధ్య మాటల యుద్ధం రోజురోజుకూ పెరుగుతోంది. రవాణాలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఓ పార్టీ ఆరోపిస్తుండగా.. రాజకీయ కక్షతోనే ఆరోపణలు చేస్తున్నారని మరో పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం కుందనపల్లి చెరువు నుంచి ఇతర ప్రాంతాలకు కొన్నేళ్లుగా బూడిద తరలిస్తున్నారు. 'అక్రమ రవాణాతో పాటు ప్రతి రోజూ రూ.లక్షల్లో అవినీతి జరుగుతోందని, ఇందుకు అధికార పార్టీ ముఖ్య నేత సహకారముంద'ని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపణలు ఉమ్మడి జిల్లాలో చర్చకు దారి తీశాయి. తాను స్వయంగా కొన్ని లారీలను పట్టించినప్పటికీ రవాణా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన పేర్కొంటుండగా, ఈ ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రణవ్ ఖండించారు. కౌశిక్‌రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని, అధికారులు కేసులు నమోదు చేశారనే విషయాన్ని ఆధారాలతో చూపించారు. బూడిద తరలింపు వ్యవహారంలో తమ పార్టీకి సంబంధం లేదని చెప్పడానికి తాను చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే బూడిద తరలింపు వ్యవహారంపై రవాణా శాఖ అధికారులు పక్కాగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. తరలింపు కేంద్రం వద్ద సీసీ కెమెరాల నిఘాతో పాటు రోజువారీగా ఎన్ని వాహనాలు వెళుతున్నాయనే విషయమై వివరాలు పక్కాగా ఉంటేనే బూడిద రవాణా ప్రక్రియ పారదర్శకంగా సాగే వీలుంది. అంతేకాకుండా వాహనాలను మార్గమధ్యంలో తనిఖీలు చేయడం వల్ల అక్రమాలకు అడ్డుకట్ట వేసే అవకాశముంది. మోతాదు కంటే అధిక పరిమాణంలో సరఫరా చేస్తుండటంతో లారీల వెనుక ప్రయాణించే ద్విచక్రవాహనదారులు అవస్థలు పడుతున్నారు. రామగుండం నుంచి రాజీవ్ రహదారి సహా హుజూరాబాద్, వరంగల్ మార్గంలో నిత్యం వివిధ జిల్లాలకు పెద్ద ఎత్తున బూడిద రవాణా జరుగుతోంది. రాత్రింబవళ్లు వందలాది వాహనాలు వెళ్తుండటంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. లారీలతో పలు చోట్ల రహదారులు ధ్వంసమవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్రమాలు, అవినీతికి తావు లేకుండా బూడిద రవాణా ప్రక్రియ నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఈ విషయమై పెద్దపల్లి జిల్లా రవాణా శాఖ అధికారి రంగారావును 'ఈనాడు' వివరణ కోరగా ఇటీవలి కాలంలో 70 వరకు అనుమతి లేని బూడిద లారీలను పట్టుకొని జరిమానా విధించామని చెప్పారు. బూడిద తరలింపులో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రామగుండంలోని బొగ్గు ఆధారిత ఎన్టీపీసీ విద్యుత్తు పరిశ్రమ నుంచి వెలువడే తడి, పొడి బూడిదను అంతర్గాం మండలం కుందనపల్లిలోని ప్రత్యేక చెరువులో నింపుతారు. 500 ఎకరాల్లో ఉన్న ఈ చెరువులో ప్రతి రోజూ టన్నుల కొద్దీ బూడిదను డంప్ చేస్తారు.

# వనరుల పరిరక్షణకు కార్యాచరణ..!



పెద్దపల్లి,తెలంగాణ దిశ:చెరువులు, నీటి కుంటలు పెద్ద ఎత్తున ఆక్రమణకు గురవుతున్నాయి. మురుగు, రసాయనాలతో కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. గతంలో నీటి వనరుగా ఉపయోగపడిన చెరువులు ప్రస్తుతం చాలా చోట్ల మురుగు నిల్వకు కేంద్రంగా మారాయి.ఈ క్రమంలో చెరువుల పునరుద్ధరణపై ప్రభుత్వం దృష్టి సారించింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో భూగర్భ జలాలను కాపాడుకునేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు పురపాలక శాఖకు బాధ్యత అప్పగించింది. తటాకాల పరిరక్షణకు కృషి చేస్తున్న సంస్థలు, వివిధ రంగాల నిపుణులు, రాష్ట్రంలోని కమిషనర్లతో పురపాలక శాఖ సమీక్షలు నిర్వహించింది. పురపాలక, నీటిపారుదల, రెవెన్యూ శాఖలకు చెందిన ఇంజినీర్లు, అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కేంద్ర జలశక్తి శాఖ గతేడాది నిర్వహించిన ఓ అధ్యయనం ప్రకారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 30 శాతం చెరువులు, 40 శాతం కుంటలు ఆక్రమణలకు గురైనట్లు తేలింది. కరీంనగర్, రామగు ండం, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల, వేములవాడ వంటి పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువ శాతం కబ్జాలు జరిగినట్లు వెల్లడించింది. ఓవైపు ఆక్రమణలతో చెరువులు కుచించుకుపోగా మరోవైపు మురుగును నేరుగా తటాకాల్లోకే మళ్లిస్తున్నారని నివేదికల్లో తేలింది. సర్వేలోఇలాంటి చెరువులను గుర్తించి అవసరమైన చోట్ల మురుగు శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) నిర్మించేలా చర్యలు తీసుకోవాలని పురపాలక అధికారులకు ఆదేశాలు అందాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 4,283 చెరువులున్నాయి. అంతటా కలిసి 2 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టున్నా 1.27 లక్షల ఎకరాలకు, అది కూడా ఒక పంటకు మాత్రమే నీరందేది. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ కింద మొత్తం రూ.741.18 కోట్లతో 1,833 చెరువులను పునరుద్ధరించగా నీటి నిల్వసామర్థ్యం19.93 టీఎం సీలకు పెరిగింది. అయితే కొన్ని చెరువులు కళ తప్పాయి. మరికొన్ని చోట్ల ఆక్రమణకు గురయ్యాయి. పశువులు, కోళ్ల వ్యర్థాలు, మురుగుతో కాలుష్య కాసారాలుగా మారాయి.

# 3 లక్షల గృహప్రవేశాలు



**విజయవాడ,,తెలంగాణ దిశ:** ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి సర్కారు ఏర్పాటై.. మరికొన్ని రోజుల్లో ఏడాది పూర్తి కానుంది. 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని రేంజులో ఘన విజయం అందుకుంది ఎన్డీఏ కూటమి. మొత్తం 175 స్థానాలకు గానూ.. 164 చోట్ల టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. దీంతో తిరుగులేని మెజారిటీతో టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్, మంత్రులుగా నారా లోకేష్ సహా కీలక నేతలు ప్రమాణ స్వీకారం చేశారు. అమరావతిలో జరిగిన ఆ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా హాజరయ్యారు. అయితే ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరి వచ్చే జూన్ 12తో ఏడాది పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం భారీ శుభవార్త వినిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఎన్డీఏ కూటమి సర్కారు ఏడాది పాలన పూర్తైన సందర్భంగా కొత్తగా నిర్మించిన 3 లక్షల ఇళ్లను ప్రారంభించి.. గృహప్రవేశాలు చేయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు జూన్ 12వ తేదీని ముహూర్తంగా నిర్ణయించినట్లు సమాచారం. మూడు లక్షల మంది పేదలకు ఇళ్లను అందించి.. అదేరోజు వారితో గృహప్రవేశాలు చేయించేలా ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జూన్ 12 వ తేదీ లోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసిం ది. మూడు లక్షల ఇళ్లల్లో ఇప్పటి వరకూ 1.70 లక్షలు పూర్తికాగా.. మరో 60 వేల ఇళ్లు తుది దశలో ఉన్నాయి. గడువులోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయించేందుకు ప్రభుత్వం అదనపు సాయం కూడా అందిస్తున్న విషయం తెలిసిందే. బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు రూ.50 వేలు చొప్పున, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు సాయం అందిస్తున్నారు. గడువులోగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేయించాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ (హౌసింగ్) అజయ్ జైన్ జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై ప్రతిరోజూ జిల్లా కలెక్టర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో నిత్యం సమీక్షిస్తున్నారు. పనులను గడువులోగా పూర్తి చేసేలా సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

# భగవత్ విద్వేషం!



దేశ వ్యాప్తంగా ప్రజలందరికీ ఒకే గుడి, ఒకే బావి, ఒకే స్మశాన వాటికలకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ ఆదివారం తన అలీగఢ్ పర్యటనలో ఇచ్చిన పిలుపు రాజ్యాంగాన్ని సవాల్ చేయడమే అవుతుంది. సంఘ్ మూల సిద్ధాంతం హిందూ రాష్ట్ర స్థాపన దిశకు నడిపించడంగా పరిగణించాలి. భగవత్ విద్వేష వ్యాఖ్యలను రాజ్యాంగాన్ని ఆమోదించే, లౌకిక, ప్రజాస్వామ్యాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలి. దేశంలో మత విభజనకు ఒడిగట్టి భగవత్ ఇంతగా బరితెగించి విషం కక్కడం మోడీ ప్రభుత్వ అండతోనే సాధ్యమవుతుంది. దేశ సమైక్యతకు, సమగ్రతకు విఘాతం కలిగించే వారిపై దేశ ద్రోహం వంటి కఠిన సెక్షన్ల కింద కేసులు పెట్టి జైలుకు పంపాలి. భగవత్‌పై అది జరగలేదంటేనే బిజెపి, మోడీ ప్రభుత్వ మద్దతు ఏ స్థాయిలో ఉందో తేటతెల్లమవుతోంది. భారతదేశం విభిన్న మతాలు, కులాలు, జాతుల సమాహారం. భిన్నత్వంలో ఏకత్వం మన సంస్కృతి, సంప్రదాయం, వారసత్వం. ఈ సామాజిక వైవిధ్యంగానే లౌకిక రాజ్యంగా భారత్ అవతరించింది. రాజ్యాంగ స్వరూపానికి అదే పునాది. ఆసేతు హిమాచలం ప్రజలందరినీ దండలో దారంలా కలిపి ఉంచుతున్నదిదే. ఈ వ్యవస్థను విధ్వంసం చేయాలన్నది సంఘ్ చిరకాల వాంఛ. దానిలోనుంచి పుట్టినదే తాజాగా భగవత్ నోటి నుంచి ఆవిష్కృతమైన విద్వేష 'సందేశం'.

ఆర్ఎస్ఎస్‌కు బిజెపి రాజకీయ విభాగం అన్నది బహిరంగ రహస్యం. కేంద్రంలో మోడీ అధికారంలోకొచ్చాక సంఘ్ మార్గదర్శకత్వంలోనే ప్రభుత్వం పని చేస్తోందనడానికి కేబినెట్ కూర్పు సహా పలు దృష్టాంతాలు కనిపిస్తాయి. ఎప్పటికప్పుడు నాగపూర్‌లోని సంఘ్ హెడ్‌క్వార్టర్‌కు ప్రోగ్రెస్ రిపోర్టులను సమర్పించి దిశా నిర్దేశాలను స్వీకరించడం తెలిసిందే. బిజెపి సర్కారు రెండవ తడవ పాలనా పగ్గాలు చేపట్టిన వెంటనే 370 ఆర్టికల్‌ను రద్దు చేసినా, మూడవ సారి పీఠం ఎక్కాక ముస్లింల లక్ష్యంగా వక్ఫ్ సవరణ చట్టాన్ని బుల్డోజ్ చేసినా సంఘ్ దీర్ఘకాలిక హిందూ రాజ్య స్థాపన ప్రాజెక్టులో భాగమే. ఒకే దేశం- ఒకే ఎన్నిక, ఒకే దేశం- ఒకే భాష, ఏక రూప పౌరస్మృతి, నూతన విద్యా విధానం%ొ% ఇటువంటివన్నీ ఆర్ఎస్ఎస్ కర్మాగారంలో తయారైనవే. జమిలి ఎన్నికలనే తీసుకుంటే తమకు లోక్‌సభలో, రాజ్యసభలో మెజార్టీ లేకపోయినా ఆర్ఎస్ఎస్ అభిలాషకనుగుణంగా జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) వరకు వెళ్లింది. ఆర్ఎస్ఎస్ రెండవ చీఫ్ గోల్వాల్కర్ తన సైద్ధాంతిక గ్రంథంలో ఒకే ఎన్నిక ప్రతిపాదన చేశారు. ఆ తోవకు మోడీ సర్కారు ప్రయత్నాలు ముమ్మరం కావిస్తోంది.

ఈ మధ్యనే మోహన్ భగవత్ మసీదులను కూల్చి దేవాలయాలు నిర్మించడం, మసీదు లోపల శివలింగాలను కనుగొనడం మానుకోవాలని తమ శాఖలకు సూక్తి ముక్తావళి పఠించారు. అయోధ్య అనేది ప్రత్యేక పరిస్థితుల్లో తీసుకున్నదని, అది విజయవంతమైందని శెలవిచ్చారు. అంతలోనే ప్రజలందరికీ ఒకే గుడి, బడి, వల్లకాడు అంటున్నారు. ఆర్ఎస్ఎస్‌ది రెండు నాల్కల విధానమని, గోముఖ వ్యాఘ్రమని ఈ ఉదంతంతో రూఢ అవుతుంది. అయోధ్యపై సుప్రీం కోర్టు తీర్పు వచ్చినప్పుడు, తదుపరి వంతు మధుర, కాశీ%ొ% అన్నారు. ఇటీవలనే జైపూర్ దర్గా హిందువులదన్న వివాదం లేవదీశారు. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో మసీదు కింద ఆలయం ఉందని సర్వే పేరిట నానా యాగీ చేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని కులం మన దేశంలో వేల ఏళ్లుగా వేళ్లూనుకుంది.


హిందూ మత రాజ్య స్థాపనకు కులం అవరోధమని ఆర్ఎస్ఎస్ ఎప్పుడో గుర్తించింది. కుల విభేదాలొద్దని భగవత్ చెప్పే సుద్దులు తన లక్ష్య సాధనలోనివే. జాతీయ ఐక్యత, సామాజిక ఏకత్వం, సామూహికంగా హిందూ పండగల నిర్వహణ%ొ% ఇవన్నీ హిందూ రాష్ట్ర ప్రాజెక్టులోనివే. తన వందేళ్ల ప్రస్థానంలో వీటినే ఆర్ఎస్ఎస్ నమ్ముకొని అవకాశం చిక్కినప్పుడల్లా వాటిపై కేంద్రీకరించి పని చేస్తోంది. భగవత్ విద్రోహ వ్యాఖ్యలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలి. కేంద్రంలో మోడీ మనుగడకు భుజం కాసే పార్టీలు తమ వైఖరి చెప్పాలి. దేశ ఐక్యతను సవాల్ చేస్తున్న సంఘ్‌ను ఒంటరి చేసి దోషిగా నిలబెట్టేందుకు లౌకిక, ప్రజాస్వామిక వాదులు నడుం కట్టాల్సిన సమయమిది.

# కొరగాని కొయ్యగా ఆదినారాయణరెడ్డి



**కడప,తెలంగాణ దిశ:** జమ్మలమడుగు బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వ్యవహార శైలి చర్చకు దారితీస్తోంది. గత కొద్దిరోజులుగా స్థానిక పరిశ్రమల యాజమాన్యాలకు, ఆయనకు మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో కొంతమంది నేతలతో సైతం ఆయన వివాదాలు పెట్టుకుంటున్నారు. మొన్న ఆ మధ్యన అనంతపురం జిల్లాకు చెందిన టిడిపి నేత జెసి ప్రభాకర్ రెడ్డి వర్గీయులతో వివాదం నడిచింది. అక్కడకు కొద్ది రోజుల తరువాత సొంత పార్టీ ఎంపీ సీఎం రమేష్ తో సైతం విభేదించారు ఆదినారాయణ రెడ్డి. ఇప్పుడు స్థానికంగా ఉన్న ఓ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తోందని ఆరోపిస్తున్నారు ఆదినారాయణ రెడ్డి. స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని చెబుతున్నారు. గత కొద్దిరోజులుగా ఆ ఫ్యాక్టరీ ఉత్పత్తులకు సంబంధించి ముడుసరుకుల రవాణాను ఆదినారాయణ రెడ్డి వర్గీయులు అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆదినారాయణ రెడ్డి ఈ విషయంపై స్పందించారు. తనది తప్పని తేలితే రాజకీయాలనుంచి వైదొలుగుతానని స్పష్టం చేశారు. కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ ఉంది. అయితే ఆ కంపెనీలో స్థానికులకు అవకాశం ఇవ్వాలని ఆదినారాయణ రెడ్డి కోరుతున్నారు. అయితే ఇప్పటికే కంపెనీలో కాంట్రాక్ట్ పనులకు సంబంధించి గడువు ఉంది. కానీ దానితో సంబంధం లేకుండా తన వర్గీయులకు పనులు కేటాయించాల్సిందేనని ఆయన తేల్చి చెబుతున్నారు. సంబంధిత యాజమాన్యం పట్టించుకోకపోవడంతో ఆదినారాయణ రెడ్డి వర్గీయులు ఫ్యాక్టరీ ఉత్పత్తులు, ముడి సరుకుల రవాణాను అడ్డుకుంటున్నారన్నది ఒక ప్రచారం. ఇదే విషయంపై సంబంధిత ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో పాటు మీడియాకు సమాచారం ఇచ్చింది. అలా వెలుగులోకి వచ్చింది ఆ వివాదం. దీనిపై ఆదినారాయణ రెడ్డి స్పందిస్తూ త్వరలో చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. కొద్ది రోజులుగా ఆదినారాయణ రెడ్డివ్యవహారం కూటమికి తలనొప్పిగా మారింది. జమ్మలమడుగు నియోజకవర్గంలో ఫ్యాక్టరీల యాజమాన్యాలపై జులుం ప్రదర్శిస్తున్నారంటూ ఆదినారాయణ రెడ్డి పై విమర్శలు ఉన్నాయి. సిమెంట్ ఫ్యాక్టరీలకు అవసరమైన ముడుసరుకు సరఫరా కాంట్రాక్టులతో పాటుగా అన్ని రకాల కాంట్రాక్టులు తన వారికే ఇవ్వాలని ఆదినారాయణ రెడ్డి డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయితే స్థానికుల తరుపున పోరాడుతున్నందునే తనపై ఆరోపణలు చేస్తున్నారని ఆదినారాయణ రెడ్డి చెబుతున్నారు. తనది తప్పని తేలితే రాజకీయాల నుంచి తప్పుకుంటానంటూ ఆదినారాయణ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఎర్రగుంట్ల, చిలమకూరులో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ యూనిట్లు ఉన్నాయి. ఇది గతంలో ఇండియా సిమెంట్స్ ఆధీనంలో ఉండేవి. గత ఏడాది నుంచి అల్ట్రాటెక్ యాజమాన్యం పరిధిలోకి వెళ్లాయి. అయితే ఈ యూనిట్లకు ఫ్లైయాష్, సున్నపురాయి సరఫరా జరగకుండా ఇటీవల ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వర్గీయులు అడ్డుకున్నారు. రాయలసీమ థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి ఈ ఫ్యాక్టరీలకు తరలిస్తుంటారు. వాటిని ఆదినారాయణ రెడ్డి అనుచరులు అడ్డుకోవడం వివాదంగా మారింది. లారీలను నిలిపివేయడంతో ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో సంబంధిత యాజమాన్యం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. మీడియాలో పతాక శీర్షికన కథనాలు రావడంతో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి స్పందించారు. ఇందులో తన తప్పు లేదని చెప్పుకునే ప్రయత్నం చేశారు.

# రూ.లక్ష దాటిన బంగారం ధరలు...



ఢిల్లీ ,: ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి కారణంగా బంగారం ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి. సంపన్నులకే దడ పుట్టించేలా ప్రస్తుతం బంగారం రేట్లు పెరుగుతూపోతున్నాయి. తాజాగా బంగారం ధరలు ఆల్‌టైమ్ హైకి తాకాయి. దేశీయంగా 24 క్యారెట్ 10 గ్రాముల పుత్తడి ధర ఏకంగా రూ.లక్ష దాటింది. ఢిల్లీ , ముంబై, కోల్‌కతా, చెన్నై సహా అన్ని ప్రధాన నగరాల్లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన ఒక గ్రాము బంగారం ధర రూ.10,000 పైనే పలుకుతోంది. అత్యధికంగా దేశరాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన పది గ్రాముల బంగారం ధర రూ.1,02,160కు చేరింది. ఢిల్లీలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన గ్రాము బంగారం ధర రూ.10,150గా ఉంది. నోయిడా, గురుగ్రామ్, ముంబై, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా నగరాల్లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన గ్రాము బంగారం ధర రూ.10,135గా ఉంది. రానున్న రోజుల్లో తులం బంగారం ధర రూ.1.50 లక్షలకు చేరుకునే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

కరెన్సీ మార్కెట్‌లో అమెరికన్ డాలర్ బలహీనపడటం, అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం కొనసాగుతుండటం.. గోల్డ్ మార్కెట్‌ను షేక్ చేస్తున్నది. స్టాక్ మార్కెట్లలో ఒడిదుడుకులు నెలకొనడంతో మదుపరులు తమ పెట్టుబడులను పసిడి వైపునకు మళ్లిస్తున్నారు. ఇక బహిరంగ మార్కెట్‌లో ధరల పెరుగుదలతో కొనుగోలుదారుల నుంచి పెద్దగా గిరాకీ లేకున్నా.. జ్యుయెల్లర్స్, రిటైలర్స్ నుంచి డిమాండ్ కనిపిస్తున్నది. ఈ క్రమంలోనే మార్కెట్‌లో పుత్తడి ధరలు దౌడు తీస్తున్నాయని మెజారిటీ నిపుణుల విశ్లేషణ. కాగా, అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రభావం చైనా మినహా మిగతా దేశాలపై ఆగినా.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మాత్రం ఆ సెగ తగులుతూనే ఉన్నది. ఈ క్రమంలో ఆయా దేశాలతో జరుగుతున్న అమెరికా ట్రేడ్ డీల్స్‌నుబట్టి భవిష్యత్తులో బంగారం రేట్ల పెరుగుదలలో వేగం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

## దుబాయిలో హత్యకు గురైన కుటుంబాలను ఆదుకోవాలి

మెట్ పల్లి : దుబాయిలో ఇటీవల హత్యకు గురైన తెలంగాణ ప్రాంతానికి చెందిన ముగ్గురి కుటుంబాలను, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని, అంతేగాక వారి మృతదేహాలను త్వరితగతిన ఇండియాకు తెప్పించాలని సుఖీభవ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు బొక్కెనపల్లి నాగరాజ్ కోరాడు. ఈ సందర్భంగా పత్రిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, నిర్మల్ జిల్లా సోన్ గ్రామం, ఆర్మూర్ మరియు ధర్మపురి దగ్గర దమ్మన్నపేట గ్రామాలకి చెందిన వీరు ఉన్న ఊరిని, కన్న వారిని, భార్య పిల్లలను సైతం దూరం పెట్టుకుని జీవనోపాధి కోసం దుబాయికి వెళితే, అక్కడ ఓ బేకరీలో, కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తెలంగాణ ప్రాంత వాసులైన ముగ్గురు వ్యక్తులను అతి కిరాతకంగా చంపడం ఘోరాతి ఘోరమన్నారు. తెలంగాణ ప్రాంత వాసులను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించేలా,

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వాల పైన ఉందన్నారు. ఈ సమావేశంలో నాంపల్లి గట్టయ్య, దొంతుల చిన్నయ్యలు పాల్గొన్నారు.

# గూగుల్ లోనూ.. లే ఆఫ్స్, టార్గెట్

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** టెక్ దిగ్గజం గూగుల్ భారతదేశంలో ఉద్యోగుల తొలగింపు (లేఆఫ్స్) ప్రక్రియకు సిద్ధమవుతున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. బెంగళూరు, హైదరాబాద్ కార్యాలయాల్లో ప్రధానం గా ప్రకటనలు, సేల్స్, మార్కెటింగ్ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు ఈ ప్రభావాన్ని ఎదుర్కోనున్నారు. ఈ చర్యలు కంపెనీ యొక్క ప్రపంచవ్యాప్త పునర్వ్యవస్థీకరణ, నిర్వహణ సామర్థ్యం పెంపొందించే ప్రయత్నాల భాగంగా చూడవచ్చు. అయితే, ఇంజినీరింగ్ ఉద్యోగులకు సంబంధించి గూగుల్ కొంత సానుకూల విధానాన్ని అనుసరించనుం ది. ఈవార్తలు భారత టెక్ రంగంలో ఉద్యోగ భద్రతపై ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి. గూగుల్ భారతదేశంలోని బెంగళూరు, హైదరాబాద్ కార్యాలయాల్లో ఉద్యోగుల తొలగింపు ప్రక్రియను వచ్చే వారం నుంచి ప్రారంభించే అవకాశం ఉన్నట్లు బిజినెస్ స్టాండర్డ్‌నివేదిక అంచనా వేసింది. ప్రధానంగా ప్రకటనలు, సేల్స్, మార్కెటింగ్ విభాగాల్లోని ఉద్యోగులు ఈ లేఆఫ్స్ ప్రభావాన్ని ఎదుర్కొనవచ్చు. గూగుల్ ఈ విషయంపై అధికారికంగా ధ్రువీకరించకపోయినప్పటికీ, కంపెనీ ఇటీవలి పునర్వ్యవస్థీకరణ చర్యలు ఈ నిర్ణయానికి నేపథ్యంగా ఉన్నాయి. గూగుల్ భారతదేశంలో సుమారు 10 వేల మంది ఉద్యోగులను కలిగి ఉందని అంచనా, ఇందులో గణనీయమైన సంఖ్య బెంగళూరు, హైదరాబాద్ కేంద్రాల్లో ఉన్నారు. యొక్క ప్లాట్‌ఫామ్స్ అండ్ డివైజెస్‌విభాగంలో 2024లో జరిగిన పునర్వ్యవస్థీకరణలో భాగంగా, ఆండ్రాయిడ్, పిక్సెల్ స్మార్ట్‌ఫోన్లు, క్రోమ్ బ్రౌజర్ వంటి కీలక ఉత్పత్తులను నిర్వహించే ఈ విభాగం నుంచి ప్రపంచవ్యాప్తంగా వందలాది మంది ఉద్యోగులు తొలగించబడ్డారు. ఈ విభాగం గూగుల్ ఆర్థిక ఆదాయంలో సింహభాగం సమకూర్చినప్పటికీ, మారుతున్న వ్యాపార ప్రాధాన్యతలకు అనుగుణంగా నిర్వహణ సామర్థ్యాన్ని పెంచడం, ఖర్చులను తగ్గించడం లక్ష్యంగా కంపెనీ ఈ చర్యలు చేపట్టింది. 2023లో గూగుల్ ప్రపంచవ్యాప్తంగా 12 వేల మంది ఉద్యోగులను తొలగించిన నేపథ్యంలో, ఈ తాజా లేఆఫ్స్ ఊహాగానాలు ఉద్యోగుల్లో ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. భారతదేశంలో గూగుల్ ఇంజినీరింగ్ ఉద్యోగుల విషయంలో కొంత సానుకూల విధానాన్ని అనుసరించనుందని నివేదికలు సూచిస్తున్నాయి. బెంగళూరు, హైదరాబాద్ క్యాంపస్‌లలో టెక్నికల్ పొజిషన్లలో ఉన్న ఉద్యోగులను నేరుగా తొలగించడానికి బదులుగా, ఆదాయం సమకూర్చే ఇతర ప్రాజెక్టులకు బదిలీ చేసే అవకాశం ఉంది. గూగుల్ ఇండియా ఇంజినీరింగ్ బృందాలు కృత్రిమ మేధస్సు, క్లౌడ్ కంప్యూటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ వంటి కీలక రంగాల్లో ముఖ్యమైన బాధ్యతలను నిర్వహిస్తాయి, ఇవి కంపెనీ యొక్క దీర్ఘకాల వృద్ధికి కేంద్రంగా ఉన్నాయి. ఈ సానుకూల విధానం టెక్ రంగంలో భారత ఉద్యోగుల విలువను సూచిస్తుంది. గూగుల్ గత కొన్ని సంవత్సరాలుగా అంతర్గత నిర్మాణంలో విస్తృత మార్పులు చేస్తోంది. 2024లో కంపెనీ తన ప్లాట్‌ఫామ్స్ అండ్ డివైజెస్ బృందాలను విలీనం చేసింది, దీనిలో ఆండ్రాయిడ్, క్రోమ్, పిక్సెల్ హార్డ్‌వేర్ విభాగాలు సమన్వయించబడ్డాయి. ఈ విలీనం తర్వాత, ఉద్యోగుల క్రమబద్ధీకరణలో భాగంగా కొందరిని తొలగించారు. జనవరి 2025లో, గూగుల్ తన ఉద్యోగులకు స్వచ్ఛంద విరమణ (వాలంటరీ సెపరేషన్) పథకాలను ప్రవేశపెట్టినట్లు ధ్రువీకరించింది, ఇందులో సెవరెన్స్ ప్యాకేజీలు, రీలొకేషన్ సపోర్ట్ వంటి ప్రోత్సాహకాలు అందించబడ్డాయి. ఈ చర్యలు కంపెనీ యొక్క ఖర్చు నియంత్రణ, వనరుల సమర్థవంతమైన వినియోగం కోసం ఉద్దేశించినవి. గూగుల్ లేఆఫ్స్ టెక్ రంగంలో కొనసాగుతున్న విస్తృత ట్రెండ్‌లో భాగంగా చూడవచ్చు. 2023?2024లో అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్ వంటి టెక్‌దిగ్గజాలు ప్రపంచవ్యాప్తంగావేలాది మందిఉద్యోగులను తొలగించాయి, ఇది ఆర్థిక మాంద్యం భయాలు, అఐ ఆటోమేషన్, వ్యాపార పునర్వ్యవస్థీకరణలకు ఆపాదించబడింది. భారతదేశం, టెక్ రంగంలో ఒక ప్రధాన కేంద్రంగా, ఈ లేఆఫ్స్ ప్రభావాన్ని తీవ్రంగా అనుభవిస్తోంది. నాస్కామ్ నివేదిక ప్రకారం, 2024లో భారత ఐటీ రంగంలో 5?7% ఉద్యోగ కోతలు నమోదయ్యాయి, ఇది యువ టెక్ నిపుణులలో ఉద్యోగ భద్రతపై ఆందోళనలను పెంచింది. గూగుల్ లేఆఫ్స్ నిర్ణయం ఉద్యోగులలో ఒత్తిడిని, అనిశ్చితిని పెంచుతోంది. సేల్స్, మార్కెటింగ్ విభాగాల్లోని ఉద్యోగులు కొత్త అవకాశాల కోసం వెతకాల్సి రావచ్చు, అయితే ఇంజినీరింగ్ ఉద్యోగులకు అంతర్గత బదిలీలు కొంత ఊరటనిస్తాయి. గూగుల్ యొక్క వ్యూహం అఐ, క్లౌడ్, డిజిటల్‌అడ్వర్టైజింగ్ వంటి అధికవృద్ధి రంగాలపై దృష్టి సారించడం, ఖర్చుసామర్థ్య రంగాలను తగ్గించడంపై కేంద్రీకృతమై ఉంది. ఈ చర్యలు కంపెనీ యొక్క ఆర్థికలాభాలనుబలోపేతం చేసినప్పటికీ, ఉద్యోగుల మనోధైర్యంపై, కంపెనీ సంస్కృతిపై ప్రభావం చూపవచ్చు.

## రోడ్డు ప్రమాద బాధితునికి లయన్స్ క్లబ్ ఆర్థిక సహాయం

పెద్దపల్లి : ఎలిగేడు మండలం సుల్తాన్ పూర్ గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన కెందే కలమ్మ-హనుమంతు ల కుమారుడు కెందే శేఖర్ అనే 21 సంవత్సరాల యువకుడు కరీంనగర్ లోని అపోలో ఆసుపత్రిలో చేరడంతో వైద్యులు పరీక్షించిన అనంతరం అతడి కుడి కాలును తొలగించారు. ఈ సందర్భంగా శేఖర్ మిత్రులు సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ సహాయం కోరగా వెంటనే స్పందించిన క్లబ్ ప్రతినిధులు ఆసుపత్రిలో శేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి వైద్య ఖర్చుల కోసం 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అతని తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ పూర్తిగా కోలుకున్న తర్వాత ప్రమాదంలో కోల్పోయిన కాలు స్థానంలో కృత్రిమ కాలును అమర్చడానికి తమ సాయ శక్తుల కృషి చేస్తామని తెలిపారు. అలాగే బాధిత కుటుంబానికి మానవతా దృక్పథంతో సేవా తత్పరులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం చేయాలని కోరారు. అనంతరం సహకరించిన లయన్స్ క్లబ్ కు బాదిత కుటుంబం ధన్యవాదాలు తెలిపారు.



# పెళ్లి ఎప్పుడో చెప్పలేను..త్రిష



నాలుగు పదుల వయసులోనూ వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు నటి త్రిష. అయితే, ఆమె వైవాహిక బంధంలోకి ఎప్పుడు అడుగు పెడుతుందా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆమె పెళ్లి గురించి ఇప్పటికే ఎన్నో వార్తలు వచ్చాయి. ఈనేపథ్యంలో తాజాగా ఆమె వివాహంపై తన అభిప్రాయాన్ని బయటపెట్టారు. తనకు పెళ్లిపై సదుద్దేశం లేదని వ్యాఖ్యలు చేశారు. 'థగ్‌లైఫ్' ప్రమోషన్స్‌లో భాగంగా ఓఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమెను.. 'మూడుముళ్ల బంధంపై మీ అభిప్రాయం ఏమిటని ప్రశ్నించగా.. నిజం చెప్పాలంటే నాకు వివాహంపై నమ్మకం లేదు. నాకు పెళ్లి అయినా ఓకే, కాకపోయినా ఫర్వాలేదని ఆమె బదులిచ్చారు. ఆమె ఇచ్చిన సమాధానంతో పక్కనే ఉన్న కమల్‌హాసన్ షాకయ్యారు. త్రిష పెళ్లి గురించి కొంతకాలంగా వదంతులు వ్యాప్తి చెందుతోన్న విషయం తెలిసిందే. ఆమె ప్రేమలో ఉన్నారని త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్నారని ఇటీవల ప్రచారం జరిగింది. ఆవదంతులను ఆమె ఖండించారు.

పెళ్లి ఎందుకు చేసుకోలేదు అంటే నా వద్ద సమాధానం లేదు. పెళ్లి ఎప్పుడు చేసుకుంటానో మాత్రం నాకే తెలియదు. నా మనసుకు నచ్చిన వ్యక్తి దొరికితే కచ్చితంగా చేసుకుంటాను. నన్ను పెళ్లి చేసుకోబోయేవాడు జీవితాంతం నాకు తోడు ఉంటాడనే నమ్మకం కలగాలి. అప్పుడే చేసుకుంటాను. పెళ్లి చేసుకొని విడాకులు తీసుకోవడం నాకు ఇష్టం లేదు. పెళ్లి చేసుకొని చాలామంది అసంతృప్తితో జీవిస్తున్నారు. అలాంటి పరిస్థితి నాకు ఎదురుకాకూడదనిఓసందర్భంలో చెప్పారు. థగ్ లైఫ్' విషయానికి వస్తే.. మణిరత్నం-కమల్ హాసన్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రమే ఇది. సుమారు 38 ఏళ్ల తర్వాత వీరిద్దరి కాంబోలో వస్తోన్న చిత్రమిది. శింబు,త్రిష కీలక పాత్రలు పోషించారు. ఈసినిమా నుంచి పెళ్లి సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో చిత్రబృందం పాల్గొని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాన్ ఇండియా స్థాయిలో జూన్ 5న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానున్నట్లు- చెప్పారు. ఇందులో పాల్గొన్న త్రిష..థగ్ లైఫ్'లో అవకాశం వచ్చినందుకు సంతోషంగా భావిస్తున్నా. కమల్‌హాసన్ లాంటి గొప్ప నటుడితో స్క్రీన్ పంచుకోవడం నా అదృష్టం అని తెలిపారు.

# రామాయణ నుండి అదిరిపోయే అప్‌డేట్..

రామాయణ ఇతిహాసం మనం సినిమాలు, సీరియల్స్‌గా పలు భాషలలో చూశాం. చిన్నప్పటి నుండి రామాయణాన్ని ఎన్నో విధాలుగా తెరపైన వీక్షించాం. ఇక రామాయణాన్ని సరికొత్తగా ఈ తరం వారికి చేర్చాలనే ఉద్దేశంతో పలువురు దర్శకులు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం విడుదలైన ప్రభాస్ ఆదిపురుష్ చిత్రం రామాయణం ఆధారంగా తెరకెక్కినదే. అయితే ఈ చిత్రం ప్రేక్షకుల ఆదరణ అందుకోలేకపోయింది. అంతేకాకుండా, రామాయణాన్ని వక్రీకరించారన్న విమర్శలూ గట్టిగానే వినిపించాయి. ఇప్పుడు కన్నడ స్టార్ హీరో యష్ ప్రధాన పాత్రలో 'రామాయణ' మూవీని తెరకెక్కించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు పార్ట్‌లుగా రామాయణ చిత్రం తెరకెక్కనుండగా, ఈ మూవీకి నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్ రాముడిగా.. సాయిపల్లవి సీతమ్మగా నటిస్తున్నారు. ఇందులో రావణుని పాత్రలో యశ్ కనిపించనున్నారు.

అయతే ఉదయం ఉజ్జయినీ మహాకాళేశ్వర్‌ను దర్శించుకున్నారు కన్నడ స్టార్ హీరో యష్. స్వామి వారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన త్వరలోనే ఆయన 'రామాయణ పార్ట్ 1మూవీ సెట్‌లో అడుగుపెట్టబోతున్నట్టు తెలుస్తుంది. యష్ తన ప్రతీ సినిమాను ఆలయ సందర్శనతో ప్రారంభిస్తారు. ఇందులో భాగంగానే 'రామాయణ' మూవీలో భాగం అయ్యే ముందు శివున్ని దర్శించుకున్నారని ఫ్యాన్స్ భావిస్తున్నారు. భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత



ప్రతిష్ఠాత్మకమైన మైథలాజికల్ ఎపిక్‌గా ఈ మూవీ తెరకెక్కుతుంది. తొలి పార్ట్ షూటింగ్ తుది దశకు చేరుకోగా,


'పార్ట్ 2'ను సైతం అప్పుడే పట్టాలెక్కించేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ మూవీలో యశ్ రావణుడి పాత్ర పోషించడమే కాదు, తన బ్యానర్ అయిన మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్‌తో పాటు మల్హోటా ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. 'రామాయణ పార్ట్ 1' వచ్చే ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆ తర్వాత 'పార్ట్ 2' 2027 దీపావళికి రిలీజ్ కానుంది.

# మీరు రోజూ తాగే టీ, కాఫీలలో వీటిని కలిపి తాగండి..

రోజూ చాలా మంది ఉదయం నిద్ర లేచినప్పటి నుంచి మళ్లీ రాత్రి నిద్రించే వరకు కూడా టీ లేదా కాఫీలను తెగ తాగేస్తుంటారు. అయితే టీ, కాఫీలను మోతాదులో తాగితే ఆరోగ్యకరమే అయినప్పటికీ వీటిని మరీ అతిగా సేవిస్తే మాత్రం ఆరోగ్యానికి హాని జరుగుతుంది. టీ, కాఫీలను అతిగా సేవించడం వల్ల అనేక అనర్థాలు సంభవిస్తాయి. అయితే ఇలా జరగకుండా టీ, కాఫీలను తాగాలంటే మీరు రోజూ తాగే వాటిలో పలు మసాలా దినుసులను కలుపుకోవాలి. ఇవి మన వంట ఇంట్లోనే ఉంటాయి. మనకు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. మీరు రోజూ తాగే టీ లేదా కాఫీలలో ఈ మసాలా పదార్థాలను కలిపి తాగితే రుచికి రుచి లభించడంతోపాటు ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందవచ్చు. ఈ మసాలా పదార్థాలను టీ లేదా కాఫీలలో కలపడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. ఆరోగ్యంగా కూడా సరిగ్గా ఉంటుంది.

అల్లం, దాల్చిన చెక్క..: మీరు రోజూ తాగే టీ లేదా కాఫీలో అల్లం కలిపి తాగండి. అల్లాన్ని వేసి అవి తయారు చేసి తాగండి. అల్లంలో యాంటీ మైక్రోబియల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ లక్షణాలు ఉంటాయి. ఇవి రోగాల నుంచి మనల్ని రక్షిస్తాయి. ముఖ్యంగా అల్లంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. దీని వల్ల శరీరం ఇన్ఫెక్షన్లు, వ్యాధులకు వ్యతిరేకంగా పోరాడుతుంది. సీజనల్ వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది. దాల్చిన చెక్కను కూడా టీ, కాఫీలలో కలిపి సేవించవచ్చు. దీన్ని మరిగించాల్సిన పనిలేదు. కాస్త పొడి వేసుకుని కలిపి తాగినా చాలు, ప్రయోజనం ఉంటుంది. దాల్చిన చెక్కలోనూ యాంటీ ఆక్సిడెంట్లు అధికంగానే ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తాయి. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దాల్చిన చెక్కలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు కూడా ఉంటాయి. ఇవి నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. కనుక ఆర్థరైటిస్ నొప్పులు ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

పుదీనా ఆకులు..: పుదీనా ఆకులను కూడా టీ లేదా కాఫీలో వేసి మరిగించి తాగవచ్చు. పుదీనా ఆకుల్లో మెంథాల్ ఉంటుంది. ఇది



రోగ నిరోధక వ్యవస్థకు దోహదం చేస్తుంది. వ్యాధులు రాకుండా మనల్ని రక్షిస్తుంది. పుదీనాను తీసుకుంటే జీర్ణక్రియ సైతం మెరుగు పడుతుంది.జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనంలభిస్తుంది. ఆయుర్వేద పరంగా తులసికి ఎంతో ప్రాధాన్యత ఉంది. తులసి ఆకుల్లో మన రోగ నిరోధక శక్తిని పెంచే గుణాలు ఉంటాయి. కనుక టీ లేదా కాఫీలో తులసి ఆకులను వేసి మరిగించి తాగవచ్చు. ఈ పానీయాలను సేవిస్తే రోగ నిరోధక శక్తి పెరిగి వ్యాధులు రాకుండా ఉంటాయి. అలాగే గులాబీ పువ్వుల రెక్కలతోనూ టీ, కాఫీ తయారు చేసి తాగవచ్చు. వీటిల్లో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. వ్యాధులు రాకుండా చూస్తాయి.

యాలకులు..: యాలకులతోనూ టీ లేదా కాఫీ తయారు చేసి తాగవచ్చు. ఈ పానీయాలు ఇలా చేస్తే ఎంతో రుచిగా ఉండడమే కాదు, ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తాయి. యాలకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. వ్యాధులు రాకుండా రక్షిస్తాయి. అలాగే సోంపు గింజలను కూడా టీ లేదా కాఫీలో వేసి మరిగించి తీసుకోవచ్చు. వీటిల్లో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి జీర్ణశక్తిని మెరుగు పరుస్తాయి. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తాయి. దీంతో ఇమ్యూనిటీ పెరుగుతుంది. రోగాల నుంచి రక్షణ లభిస్తుంది.

# ఇది అందరినీ నవ్వించే సినిమా: సంపూర్ణేష్ బాబు



సంపూర్ణేష్‌బాబు హీరోగా నటించిన 'సోదరా' సినిమా విడుదలకు సిద్ధమైంది. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకత్వంలో రూపొందిన ఈమూవీ ఈ నెల25న విడుదల కానుంది. ఈసందర్భంగా మూవీ టీం మీడియాతో ముచ్చటించింది.

సంపూర్ణేష్‌బాబు మాట్లాడుతూ.. 'సోదరా' సినిమా అందరినీ నవ్విస్తుందని చెప్పాడు. ఇది కుటుంబంలోని అన్నదమ్ముల కథ అని, ప్రతి ఒక్కరినీ నవ్విస్తుందని పేర్కొన్నారు. అదే సమయంలో ఏడిపిస్తుందని కూడా చెప్పారు. సినిమా చూస్తుంటే నిజ జీవితంలో జరిగిన ఘటనలు గుర్తుకు వస్తాయని పేర్కొన్నాడు.

ఈ సినిమాలో ఎంటర్‌టైన్‌మెంట్ ఎంత ఉంటుందో, ఎమోషన్ కూడా అంతే ఉంటుందని సంపూ తెలిపాడు. ఫ్యామిలీ మొత్తం ఎంచక్కా నవ్వుకునేలా ఈ సినిమా ఉంటుందని వివరించాడు. 'ఎ' సినిమాలో ఉపేంద్ర లాంటి పాత్ర చేయాలని ఉందని సంపూర్ణేష్ చెప్పుకొచ్చాడు. ఈ మూవీలో నటిస్తున్న మరో నటుడు సంజోష్ మాట్లాడుతూ.. సంపూర్ణేష్‌తో కలిసి బ్రదర్‌లా నటించడం చాలా సంతోషంగా ఉందన్నాడు. అన్నదమ్ముల మధ్య తలెత్తే మనస్పర్థలను ఈ సినిమా ఎత్తి చూపిస్తుందని పేర్కొన్నాడు.

ప్రతి ఒక్కరినీ ఇది టచ్ చేస్తుందన్నారు. ఈ మూవీ చూస్తే అన్నదమ్ముల బంధాలు మరింత బలపడతాయని చెప్పారు. నేటి తరం ప్రేక్షకులకు తగ్గట్టుగా ఎమోషన్‌తోపాటు కామెడీని కూడా మిక్స్ చేసి చూపిస్తున్నట్టు సంజోష్ వివరించాడు.

## పీ4 పథకంతో కుటుంబాల దత్తత

విజయవాడ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా థింక్ ట్యాంక్ ను ఏర్పాటు చేసుకుంటారు. వారు అనేక రకాలుగా ఆలోచించి ఇటు ఓటు బ్యాంకు పెరిగి రాజకీయంగా పార్టీ బలోపేతం అవ్వడమే కాకుండా చంద్రబాబు పాలనకు మంచి మార్కులు జనంలో పడేలా అన్ని రకాలుగా ఆలోచించి తగిన పథకాలను రూపొందిస్తారు. థింక్ ట్యాంక్ రూపొందించిన వాటిలో వర్క్ అవుట్ అయ్యేవి మాత్రమే చంద్రబాబు అందిపుచ్చుకుంటారు. అందులో నుంచి ఈ ఏడాది వచ్చిందే పీ4 పథకం. పేదరిక నిర్మూలన కోసం ఈ పథకాన్ని తెచ్చారు. సంపన్నులు పది శాతం ఉంటే పేదరికం ఎక్కువ శాతం ఉంది కాబట్టి వారిని ఆదుకునేందుక ఈ పథకాన్ని తెచ్చారు.మొన్న ఉగాది నాడు పీ4 పథకాన్ని చంద్రబాబు నాయుడు అమరావతిలో ప్రారంభించారు. అయితే ఆశించిన రీతిలో ఇప్పటి వరకూ పెద్దగా రెస్పాన్స్ రాకపోవడంతో చంద్రబాబు పీ4 పథకానికి సంపన్నులు ఆకట్టుకునేలా చర్యలు తీసుకునేందుకు ప్రజాప్రతినిధులతో పాటు తనకు సుదీర్ఘకాలం నుంచి సహకారం అందిస్తూ వస్తున్న పారిశ్రామికవేత్తలకు అప్పగించారు. వచ్చే ఆగస్టు 15వ తేదీ నాటికి కనీసం ఐదు లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం ఆన్‌లైన్ ద్వారా సంపన్నులు నేరుగా పేదలను ఆదుకునేలా అవసరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు.నియోజకవర్గాల వారిలో ప్రధానంగా సంపన్నులను గురించి పీ4 పథకానికి సాయం అందించేందుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు కూడా తమ వంతుగా ప్రయత్నం చేయాలని కోరారు. ఇది ఒక ఛాలెంజ్ గా తీసుకోవాలని ప్రజాప్రతినిధులను ఆదేశించారు. వచ్చే ఉగాది పండగ నాటికి ఎంత మేర బంగారు కుటుంబాలకు లబ్ది జరిగింది? సంపన్నుల పేర్లతో పాటు పారదర్శకంగా వివరాలను వెల్లడించి ఈ పథకాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేలా అవసరమైన చర్యలు సత్వరం ప్రారంభించాలని గట్టిగా కోరారు. ఒక పథకం విజయవంతం కావాలంటే తొలుత మనం శ్రమించాలని, తర్వాత పథకం దానంతట అదే విస్తృతంగా డెవెలప్ అవుతుందని చంద్రబాబు గట్టిగా నమ్ముతున్నారు.ముఖ్యంగా పేదరికంలో మగ్గుతూ ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని బంగారు కుటుంబాల కింద ఎంపిక చేస్తే వారు కూడా పార్టీ జెండా దించకుండా మరింతగా రాజకీయంగా ఉపయోగపడతారని చంద్రబాబు వేస్తున్న అంచనాలు వర్క్ అవుట్ అయ్యే అవకాశం కనిపిస్తుంది. దీంతో పాటు వచ్చే ఏడాది కూడా మరో కొత్త పథకంతో జనం ముందుకు రావాలని చంద్రబాబు భావిస్తున్నారు.

# వినోదం.. విజ్ఞానం..



వేసవి సెలవులు మళ్లీ వచ్చాయి. దాదాపు రెండు మూడు దశాబ్దాల క్రితం అయితే, ఎంత గొప్పగానో వుండేవి. వేసవి సెలవుల కోసం పిల్లలు, పెద్దలూ వేయి కళ్లతో ఎదురుచూసేవారు. గ్రామాల్లో వుండేవారు పట్టణాలకు, పట్టణాల్లో వుండేవారు గ్రామాల్లోని అమ్మమ్మ, నాయనమ్మల ఇళ్లకు వెళ్లేందుకు ఎంతో ఉత్సుకతతో వుండేవారు. వేసవి సెలవులు పిల్లలకు ఆహ్లాదకర సమయం. వేడి గాలులు వీస్తు న్నా, స్నేహితులతో ఆడుకోవడం, కొత్త ప్రదేశాలు చూడటం, కొత్తకొత్త ఆహార పదార్థాలను రుచి చూడటం మహా సరదాగా వుంటుంది. వేసవి సెలవులు పిల్లలకు అతి పెద్ద ఆటవిడుపుగా, మనోల్లాస వేదికలు గా వుంటాయి. కాలంతో పాటు జీవన విధానం లోను, బాల్యంలోనూ అనేక మార్పులొచ్చాయి. నేటి తరానికి ఆధునిక వేసవి మొక్కుబడిగా మారింది. కొందరు విద్యార్థులకైతే, మామూలు రోజులకూ వేసవి సెలవులకు పెద్ద తేడా కనిపించదు. అయితే ఈ సెలవులను కేవలం వినోదం కోసమే కాకుండా, వారిలో విజ్ఞాన తృష్ణను పెంచేలా ప్రణాళికలు వేయడం తల్లిదండ్రుల బాధ్యత. వారి స్తోమతకు తగిన విధంగా మార్గదర్శనం చేయడం ఉపాధ్యాయుల వంతు. 'విద్య అనేది జీవితానికి సన్నాహం కాదు, విద్య అంటే జీవితమే' అంటాడు జాన్ డ్యూయీ అనే విద్యావేత్త. నేర్చుకోవడం నిరంతర ప్రక్రియ. వేసవి సెలవుల్లో పొందే అనుభవాలు, గడించే విజ్ఞానం కూడా విద్యలో భాగమే. ఈ విషయాన్ని ఇప్పటి కార్పొరేట్ చదువులు మరుగుపరుస్తున్నాయి. చాలామంది తల్లిదండ్రులు వేసవి సెలవుల్లో పిల్లలను వివిధ కోచింగ్ సెంటర్లకు తరిమేస్తుంటారు. కేవలం పరీక్షలు, ర్యాంకుల కోణంలో కాకుండా, నిజమైన లోకజ్ఞానం కూడా అవసరమే. పిల్లల ఆసక్తి మేరకు సైన్స్ మ్యూజియంలు, ప్లానిటోరియంలకు తీసుకెళ్లడం, చారిత్రక ప్రదేశాలను చూపడం గొప్ప అనుభవం, విజ్ఞానదాయం కూడా. సమకాలీన అంశాలపై పట్టు సాధించేందుకు పుస్తకం, దినపత్రికల పఠనం, గ్రంథాలయాలకు వెళ్లడం ఎంతగానో దోహదపడతాయి. మొబైల్ ఫోన్లకు అలవాటు పడిన పిల్లలు ఇతర పుస్తకాలు చదవడం ఎప్పుడో మర్చిపోయారు. నాలుగు గోడల మధ్య పాఠ్యాంశాలను వల్లెవేసే పిల్లలకు పుస్తక పఠనం అలవాటు చేస్తే%ఔ% ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవడంతో పాటు%ఔ% భాష, భావాల వెల్లడిలో సృజనకారులుగా తయారవుతారు. కంప్యూటర్ విద్యకు అలవాటు పడిన పిల్లలు అందమైన చేతిరాతను కూడా మర్చిపోతున్నారు. గతంలో సెలవుల్లో స్నేహితులకు రంగురంగుల కాగితాలపై నిండుగా, అందమైన అక్షరాలతో ఉత్తరాలు రాసే అలవాటుండేది. ఇప్పుడా అలవాటు పూర్తిగా కనుమరుగైపోయింది. మనిషికైనా, సమాజానికైనా మార్పు, ఆధునిక జీవన విధానం అవసరమే. అయితే, అది భవిష్యత్‌ను అంధకారం చేసేదిగా వుండకూడదు. తాము చదవలేని చదువులు, తాము చేయలేని ఉద్యోగాలు తమ పిల్లల ద్వారా సాధించుకోవాలనుకునే తల్లిదండ్రుల కలలు, విద్యను వ్యాపారంగా మార్చేసిన కార్పొరేట్ విద్యాసంస్థలు, వీటికి కొమ్ముగాస్తున్న ప్రభుత్వాలు%ఔ% అన్నీ కలిసి పిల్లల అందమైన భవితను చిదిమేస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. లేలేత సూర్యకిరణాలు ముఖం మీద పడుతుంటే కళ్లు నులుముకుంటూ నిద్రలేచే బాల్యం%ఔ% ఎప్పుడో కనుమరుగైంది. తెల్లవారకముందే మోయలేనంత పుస్తకాల సంచులను భుజానేసుకుని పరుగులెత్తే బాల్యమే ఇప్పుడు మనకు దర్శనమిస్తుంది. 'పిల్లల మనసు ఒక తెల్లకాగితం లాంటిది. మనం దానిపై మంచి విషయాలు రాయాలి' అంటారు రవీంద్రనాథ్ టాగోర్. పిల్లల మనసులను సృజనాత్మకంగా వికసింపజేయడానికి వేసవి సెలవులు చక్కని అవకాశం. విజ్ఞానాన్ని, నైపుణ్యాలను అలవర్చుకునే అవకాశాన్ని కల్పించడం తల్లిదండ్రుల బాధ్యత. మంచి పుస్తకాలు చదివే అలవాటును, ప్రకృతితో మమేకం కావడాన్ని పిల్లలకు నేర్పించాలి. తద్వారా పర్యావరణ స్పృహ అలవడు తుంది. అదే సమయంలో సాంకేతిక విజ్ఞానాన్నీ నేర్చుకోవాలి. అది పిల్లల విజ్ఞానాన్ని, భాషా నైపుణ్యాన్ని మరింత విస్తృతం చేస్తుంది. సంగీతం, నృత్యం, చిత్రలేఖనం వంటికళలతో పాటు క్రీడలు మానసిక వికాసాన్నిస్తాయి.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215